


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 141 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 26 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :141 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 26 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## తమిళనాడులో హిందీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పటికీ చోటు లేదు

- భాషా అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం స్టాలిన్ నివాళి
- తమిళనాడులో హిందీకి ఎప్పటికీ స్థానం లేదని స్పష్టీకరణ
- హిందీ రుద్దడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని మరోసారి ఉద్ఘాటన
- అమరవీరులకు నివాళులర్పించిన పళనిస్వామి, విజయ్

- మిగతా 2లో...



# ఏర్పాట్లు ఘనం.. ఫలితం శూన్యం



- సామాన్య భక్తులు సౌకర్యాలు కంటే - విఐపి సేవలలో తరించిన జిల్లా అధికారులు
- ప్రచారం ఒకటి.. ఆచరణ మరొకటి
- గంటల తరబడి కదలని క్యూ లైన్లు
- టిక్కెట్లు ఉన్నా దర్శనం దూరం
- వీఐపీ సేవలకే జిల్లా అధికారుల మక్కువ
- చిన్నారులు, వృద్ధులకు తప్పని అవస్థలు
- భక్తుల ఆగ్రహంతో ఉద్రిక్తత
- పోలీసుదేవస్థాన అధికారుల సమన్వయ లోపం
- రథసప్తమి ఘనతను మసకబార్చిన వ్యవస్థలు

**రాష్ట్ర పండుగగా ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన అరసవెల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఉత్సవాలు చివరికి సామాన్య భక్తులకు శ్రమలు, అవస్థలే మిగిల్చాయి. 'సాధారణ భక్తులకే ప్రాధాన్యం' అంటూ ప్రచారం చేసిన జిల్లా యంత్రాంగం, వీఐపీ సేవలకే మొగ్గుచూపడంతో గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడి భక్తులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఏర్పాట్లు ఘనంగా కనిపించినా, ఫలితం మాత్రం శూన్యంగానే మిగిలిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం/అరసవిల్లి జనవరి 25 :**

కలియుగ ప్రత్యక్ష దైవం అరసవెల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఉత్సవాలు భక్తులకు కష్టాలనే మిగిల్చింది. రథసప్తమి ఉత్సవాలు ఐదురోజులు రాష్ట్ర పండుగుగా ఘనంగా నిర్వహించి, ఉత్సవాలకు సంస్కృత కార్యాక్రమాలతో పాటు వినోద కార్యక్రమాలు ఘనంగా జిల్లా అధికారులు పాలకులు నిర్వహించారు. అంతే కాకుండా రథసప్తమి రోజు స్వామివారి దర్శనానికి వచ్చే సాదారణ భక్తులకు మొదటి ప్రాదాన్యత అని జోరుగా ప్రచారం చేసారు. దీంతో భక్తులు దర్శనాలు సాఫీగా అవుతాయని స్వామివారి దర్శనానికి బారీగా తరలి వచ్చారు. అయితే దర్శనానికి వచ్చిన భక్తులకు అరసవల్లిలో చుక్కలు కనిపించాయి. గంటల తరబడి క్యూ లైన్లలో పడిగాపులు పడాల్సి వచ్చింది. అంతేకాకుండా క్యూలైన్లు గంటల కోలది కదలకపోవడంతో అరసవల్లిలో రథసప్తమి వేళ ఉద్రిక్తత చోటుచేసుకుని భక్తుల ఆగ్రహం జ్వాలలు చెలరేగాయి. టిక్కెట్లు ఉన్నా క్యూ లైన్‌లోకి అనుమతి నిరాకరణ చెయ్యడంతో పాటు ఆలయ అధికారులు సాదారణ భక్తులకు కంటే వీఐపీ సేవలకే ప్రాదాన్యత నివ్వడంతో భక్తులు మండిపడ్డారు. జిల్లా అధికారులు, నాయుకులు గత కొన్ని రోజులుగా ప్రచారంలో సామాన్య భక్తులకే ప్రాదాన్యత అన్న ప్రచారం గాలీ మాటలు గానే మిగిలాయాన్నమాట సర్వత్రా వినిపిస్తోంది. సామాన్య భక్తులను కనీసం పట్టించుకునే దాకాలు ఎక్కడా కనబడలేదు. దీంతో భక్తులు తీవ్రంగా అధికారులు తీరుపై మండిపడ్డారు. అంతేకాక చిన్నారులు, వృద్ధులు క్యూలైన్లలో తీవ్ర అవస్థలు పడినప్పటికీ తమని పట్టించుకునే వారు లేరంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్ర పండగగా ఐదు రోజులుగా జిల్లా అధికారులు, పాలకులు చేసిన హడావుడి కాస్తా వారి హంగులకే తప్పా సామాన్య భక్తులకు సత్వర దర్శనం కల్పించడంలో జిల్లా యంత్రాంగం పూర్తి వైఫల్యం చెందింది. ఇటు పోలీస్ అటు దేవస్థాన అధికారుల సమన్వయ లోపమే గందరగోళానికి ప్రదాన కారణంగా మారిందని ప్రతీనోట వినిపిస్తోంది. జిల్లా అధికారులు తీరుతో ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు.దీంతో ప్రచారంలో చూపిన రథసప్తమి ఘనత మసకబార్చి భక్తులకు అవ్యవస్థలు మిగిల్చాయని సర్వత్రా వినబడుతుంది.







## కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ వ్యూహం..

### ఏపీకి నిధులు రాబట్టాలని ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం

- పార్లమెంటు బడ్జెట్ సమావేశాలపై టీడీపీ ఎంపీలతో సీఎం చంద్రబాబు భేటీ
- ఏపీకి అత్యధిక నిధులు రాబట్టాలని ఎంపీలకు స్పష్టమైన ఆదేశం
- అమరావతికి రెండో విడత నిధులు, పోలవరం పూర్తికి సహకారం కోరాలని సూచన
- విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పిలుపు

- మిగతా 2లో...

## బంకర్ లో దాక్కున్న ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ!

- అమెరికా దాడి చేస్తుందనే భయంతో ఖమేనీ రక్షణకు అధికారుల ఏర్పాట్లు
- టెహ్రాన్ లోని గుర్తుతెలియని ప్రాంతంలో ఉన్న బంకర్ లోకి తరలింపు
- బంకర్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలను కలిపేలా ఏర్పాట్లు ఉన్నట్లు సమచారం

పెన్ పవర్ డెస్క్:ఇరాన్ ను యుద్ధ మేఘాలు కమ్ముకుంటు న్నాయి. అమెరికా సైనిక బలగా లు ఇరాన్ వైపు కదులుతున్నట్లు వార్తలు వెలువడుతు న్నాయి. అగ్రరాజ్యం

- మిగతా 2లో...

## సిక్కు తలపాగా ధరించిన పవన్ కల్యాణ్..

- మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్‌తో కలిసి నాందేడ్ గురుద్వారాను సందర్శించిన పవన్ కల్యాణ్
- గురు గోవింద్ సింగ్ సమాధి మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు, చాదర్ సమర్పణ
- పవన్ కల్యాణ్‌ను ఘనంగా సత్కరించిన గురుద్వారా కమిటీ
- గురు తేగ్ బహదూర్ 350వ షాహిదీ సమాగమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి
- ఆయన త్యాగం తరతరాలకు స్ఫూర్తినిస్తుందన్న పవన్ కల్యాణ్



- మిగతా 2లో...

## 'మన్ కీ బాత్' లో అనంతపురం గురించి ప్రస్తావించిన ప్రధాని మోదీ

- మన్ కీ బాత్ లో అనంతపురం ప్రజల జల సంరక్షణ కృషిని ప్రశంసించిన మోదీ
- 10కి పైగా జలాశయాల పునరుద్ధరణ, 7 వేల మొక్కలు నాటారని అభినందన
- దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని కితాబు




పెన్ పవర్ డెస్క్:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ప్రజల కృషిని ప్రత్యేకంగా అభినందించారు. తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నప్పటికీ, అక్కడి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జల సంరక్షణలో చూపిస్తున్న చొరవ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కరవుకు చిరునామాగా మారిన ప్రాంతంలో సామూహిక కృషితో మార్పు తీసుకువస్తూ

- మిగతా 2లో...



## ఎవరికీ తలవంచం

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఒంటరిగానే విజయం సాధిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ పేర్కొన్నారు. మరికొద్ది నెలల్లో జరిగేది ఎన్నికల పోరు కాదని.. ప్రజాస్వామ్య యుద్ధమన్నారు. మహాబలిపురంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

- మిగతా 2లో...




## సినీ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లకు 'పద్మశ్రీ'...

### మొత్తం 113 మంది 'పద్మశ్రీ'అవార్డులు

- కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి పద్మ పురస్కారాల ప్రకటన
- వివిధ రంగాలకు చెందిన 113 మంది ప్రముఖులకు పద్మశ్రీ అవార్డులు
- తెలుగు రాష్ట్రాల నుంచి మురళీ మోహన్, దీపికా రెడ్డి, గద్దె రాజేంద్ర ప్రసాద్‌లకు పురస్కారం
- మరణానంతరం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, రామారెడ్డి మామిడిలకు గౌరవం
- క్రీడాకారులు రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ

పెన్ పవర్ డెస్క్:ప్రముఖ సినీ నటులు, నటకిరీటి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, సీనియర్ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీ మోహన్‌లకు ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారం లభించింది. కళారంగంలో వారు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం వారిని ఈ అత్యున్నత పౌర పురస్కారంతో గౌరవించింది. 2026 సంవత్సరానికి గాను గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర

- మిగతా 2లో...

## ప్రభుత్వ జీతం నాకు వద్దు.. ఒక్క రూపాయి కూడా తీసుకోను

### మంతెన సంచలన నిర్ణయం

- ఏపీ ప్రభుత్వ యోగా, నేచురోపతి సలహాదారుగా నియమితులైన మంతెన
- క్యాబినెట్ హోదా ఉన్నా జీతం, సౌకర్యాలు తీసుకోబోనని ప్రకటన
- సీఎం చంద్రబాబు ముందు కఠిన నిబంధనలు పెట్టిన మంతెన సత్యనారాయణ రాజు
- ప్రభుత్వ ధనం ప్రజలదని, దాన్ని స్వీకరించనని స్పష్టీకరణ
- నిస్వార్థ సేవ చేయాలన్న మంతెన నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు

- మిగతా 2లో...



## జగన్‌కు ఆ అర్హతే లేదు

### మంత్రి నిమ్మల ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్: రాజకీయాల్లో పార్టీని నడిపే అర్హత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి లేదని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. జగన్ పాదయాత్రపై ఆయన స్పందించారు. జగన్ పాదయాత్ర చేస్తోంది జనం కోసం




- మిగతా 2లో...




# పాదయాత్ర అసలు ప్లాన్ అదేనా? వ్యూహం వర్కవుట్ అవుతుందా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు కేంద్రంలో పట్టు సడలలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా జగన్ పై ఉన్న కేసులు రవ్వంత కూడా కదలడం లేదు. అందులో టీడీపీ కేంద్రంలో ప్రధాన భాగస్వామిగా ఉంది. టీడీపీ వల్లనే కేంద్రంలో బీజేపీ మనుగడ కొనసాగుతుంది. అయినా సరే కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తేవడంలో మాత్రం చంద్రబాబు విఫలమవుతున్నారు. జగన్ అది అడ్వాంటేజీగా తీసుకున్నారు. రెండేళ్లు గడిచిపోతుంది. మరో ఏడాదిన్నరలో జగన్ పాదయాత్రను ప్రారంభించబోతున్నారు. పాదయాత్ర మొదలయితే ఇక కేసుల్లో కదలిక ఉండటం కష్టమేనని అందరికీ తెలుసు. పాదయాత్ర సమయంలో కేసులను కదిలించి లేనిపోని సానుభూతిని కూటమి కొని తెచ్చుకోలేదు.

**అదే జగన్ ధీమా...**

అందుకే జగన్ ధీమాగా ఉన్నట్లు కనపడుతుంది. మరొకవైపు పాదయాత్ర ఈసారి సుదీర్ఘంగా కొనసాగించాలని జగన్ నిర్ణయించుకున్నారు. దాదాపు ఏడాదిన్నరకు పైగానే ఆయన జనంలో ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. జగన్ పాదయాత్రకు ఏదైనా అడ్డంకులు కల్పించినా, నిబంధనల పేరుతో అడ్డు చెప్పినా గత యువగళం పాదయాత్ర తరహాలో మరొకసారి ఏపీలో జగన్ కు అనుకూలంగా సెంటిమెంట్ రాసుకుంటుంది. అందుకే జగన్ పాదయాత్రకు దిగారు. తన పాదయాత్రకు ఏ మాత్రం అడ్డంకి సృష్టించినప్పటికీ అది తనకు, తన పార్టీకి అనుకూలంగా మారుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. సానుభూతి కోసం జగన్ ఖచ్చితంగా ప్రయత్నించే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి.

**పాదయాత్ర మొదలయితే...**

మరొకవైపు ఇప్పటికే క్యాడర్, లీడర్లు బయటకు వస్తున్నారు. ఇక పాదయాత్ర మొదలయితే మరింత ఉధృతి మొదలవుతుంది. అప్పుడు కేసుల పేరుతో ఏం చేసినా అది జగన్ కు అడ్వాంటేజీగా మారుతుందన్న అంచనాలున్నాయి. జగన్ కూడా అదే కోరుకుంటున్నాడు. తనపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి జైల్లో పెడితే చంద్రబాబు తరహాలో సానుభూతి వర్క్ అవుట్ అవుతుందని ఆశిస్తున్నారు. కానీ జగన్ స్ట్రాటజీ తెలిసిన చంద్రబాబు రాష్ట్రం నుంచి కాకుండా తమ చేతులకు మట్టి అంటకుండా కేంద్ర దర్యాప్తు సంస్థల చేత అరెస్ట్ చేయించాలన్న ఆలోచన చేసినా కూటమిలో బీజేపీ కూడా భాగస్వామి కాబట్టి అది కూడా జగన్ కు సానుకూలమైన అంశమే. అందుకే జగన్ ఈ వ్యూహానికి తెరతీశారు. చంద్రబాబు మాత్రం జగన్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావడంలో విఫలమయ్యారన్న ముద్ర ఇప్పటికే టీడీపీ క్యాడర్ లో పడింది. మరి చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

## బంకర్ లో దాక్కున్న ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ!

- మొదటి పేజి తరువాయి

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దావోస్ వేదికగా ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇరాన్ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. అమెరికా దాడి చేసే అవకాశం ఉండడంతో తమ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని కాపాడుకోవడానికి చర్యలు చేపట్టారు. ఖమేనీని గుర్తుతెలియని ప్రాంతంలో ఉన్న బంకర్ లోకి తరలించినట్లు సమాచారం. టెహ్రాన్ లోనే ఈ బంకర్ ఉన్నప్పటికీ కొంతమంది ఉన్నతాధికారులకు తప్ప అది ఎక్కడుందనే విషయం ఎవరికీ తెలియదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఖమేనీని ఉంచిన బంకర్ నుంచే టెహ్రాన్ లోని వివిధ ప్రాంతాలకు వెళ్లేలా పలు సొరంగాలకు అనుసంధానించినట్లు తెలుస్తోంది. సుప్రీం లీడర్ గా తన ఆఫీసు విధులు నిర్వర్తించేందుకు వీలుగా తన చిన్న కుమారుడు మసూద్ ఖమేనీకి బాధ్యతలు అప్పగించారని ఇరాన్ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కార్యనిర్వాహక వర్గంతో సమన్వయ పనులు కూడా ఆయనే చూడనున్నట్లు తెలిపాయి. అయితే, ఈ వార్తలను ఇరాన్ ప్రభుత్వ వర్గాలు అధికారికంగా ధృవీకరించలేదు.

## తమిళనాడులో హిందీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పటికీ చోటు లేదు

- మొదటి పేజి తరువాయి

తమిళనాడులో హిందీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పటికీ చోటు లేదని డీఎంకే అధినేత, సీఎం ఎం.కె. స్టాలిన్ స్పష్టం చేశారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 'భాషా అమరవీరుల దినోత్సవం' సందర్భంగా గతంలో హిందీ వ్యతిరేక ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారిని ఆయన స్మరించుకున్నారు. హిందీని బలవంతంగా రుద్దడాన్ని తమ రాష్ట్రం ఎప్పటికీ వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా స్టాలిన్ చెన్నైలోని భాషా అమరవీరులు తలముత్తు, నటరాజన్ స్మారకం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీఎండీఏ భవనంలో వారి విగ్రహాలను ఆవిష్కరించారు. "తమిళ భాషను ప్రాణంలా ప్రేమించే రాష్ట్రం, హిందీ రుద్దడాన్ని ఐక్యంగా ఎదుర్కొంది. ప్రతిసారీ అదే తీవ్రతతో నిరసన తెలిపింది" అని స్టాలిన్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా హిందీ వ్యతిరేక ఉద్యమ చరిత్ర, డీఎంకే నేతలు సీఎన్ అన్నాదురై, ఎం. కరుణానిధి పాత్రను వివరిస్తూ ఒక వీడియోను కూడా పంచుకున్నారు. 1964-65 మధ్యకాలంలో హిందీకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో ఆత్మార్పణం చేసుకున్న వారిని తమిళనాడు 'భాషా అమరవీరులు'గా గౌరవిస్తోంది. కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం-2020 ద్వారా హిందీని రుద్దే ప్రయత్నం జరుగుతోందని డీఎంకే ఆరోపిస్తున్న నేపథ్యంలో తమిళనాడులో తమిళం, ఇంగ్లీష్ అనే ద్విభాషా సూత్రమే అమలవుతోంది. మరోవైపు అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ కూడా భాషా అమరవీరులకు నివాళులు అర్పించారు. "తల్లి తమిళం మా ప్రాణంతో సమానం" అని పళనిస్వామి పేర్కొన్నారు.

# సినీ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లకు 'పద్మశ్రీ'...

- మొదటి పేజి తరువాయి

హోం మంత్రిత్వ శాఖ శనివారం రాత్రి పద్మ పురస్కారాల జాబితాను విడుదల చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందిని పద్మ అవార్డులు వరించాయి. ఇందులో 5 పద్మ విభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు ప్రముఖులు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్‌లతో పాటు, మరణానంతరం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి (సాహిత్యం, విద్య)లకు పద్మశ్రీ లభించింది. తెలంగాణ నుంచి చంద్రమౌళి గడ్డమనుగు (సైన్స్ అండ్ ఇంజనీరింగ్), దీపికా రెడ్డి (కళలు), గూడూరు వెంకట్ రావు (వైద్యం) సహా పలువురు ఈ గౌరవాన్ని అందుకున్నారు.

కళలు, సామాజిక సేవ, సైన్స్, వాణిజ్యం, వైద్యం, విద్య వంటి వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ఏటా ఈ పురస్కారాలను అందజేస్తారు. ఈసారి అవార్డు గ్రహీతలలో 19 మంది మహిళలు, 6 మంది విదేశీ/ఎన్ఆర్ఐలు ఉండగా, 16 మందికి మరణానంతరం ఈ గౌరవం దక్కింది. ఈ పురస్కారాలను మార్చి లేదా ఏప్రిల్ నెలలో రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ప్రదానం చేస్తారు.

**పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైంది వీరే..**

1. ఎ.ఇ. ముత్తునాయగం - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - కేరళ
2. అనిల్ కుమార్ రస్తోగి - కళలు - ఉత్తర ప్రదేశ్
3. అంకే గౌడ ఎం. - సామాజిక సేవ - కర్ణాటక
4. ఆర్మిడా ఫెర్నాండెజ్ - వైద్యం - మహారాష్ట్ర
5. అరవింద్ వైద్య - కళలు - గుజరాత్
6. అశోక్ ఖాడే - వాణిజ్యం, పరిశ్రమలు - మహారాష్ట్ర
7. అశోక్ కుమార్ సింగ్ - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - ఉత్తర ప్రదేశ్
8. అశోక్ కుమార్ హల్దార్ - సాహిత్యం, విద్య - పశ్చిమ బెంగాల్
9. బల్దేవ్ సింగ్ - క్రీడలు - పంజాబ్
10. భగవాన్‌దాస్ రైక్వార్ - క్రీడలు - మధ్యప్రదేశ్
11. భరత్ సింగ్ భారతి - కళలు - బీహార్
12. భిక్ల్యా లడక్యా ధిందా - కళలు - మహారాష్ట్ర
13. బిశ్వ బంధు (మరణానంతరం) - కళలు - బీహార్
14. బ్రిజ్ లాల్ భట్ - సామాజిక సేవ - జమ్మూ మరియు కాశ్మీర్
15. బుద్ధ రష్మి మణి - ఇతరాలు (పురావస్తు శాస్త్రం) - ఉత్తర ప్రదేశ్
16. డాక్టర్ బుధ్రి తాటి - సామాజిక సేవ - ఛత్తీస్‌గఢ్
17. చంద్రమౌళి గడ్డమనుగు - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - తెలంగాణ
18. చరణ్ హెంబ్రామ్ - సాహిత్యం, విద్య - ఒడిశా
19. చిరంజీ లాల్ యాదవ్ - కళలు - ఉత్తర ప్రదేశ్
20. దీపికా రెడ్డి - కళలు - తెలంగాణ
21. ధార్మిక్‌లాల్ చునీలాల్ పాండ్యా - కళలు - గుజరాత్
22. గద్దె బాబు రాజేంద్ర ప్రసాద్ - కళలు - ఆంధ్ర ప్రదేశ్
23. గఫ్రుద్దీన్ మేవాతి జోగి - కళలు - రాజస్థాన్
24. గంభీర్ సింగ్ యోన్‌జోన్ - సాహిత్యం, విద్య - పశ్చిమ బెంగాల్
25. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం) - కళలు - ఆంధ్ర ప్రదేశ్
26. గాయత్రి బాలసుబ్రమణియన్, రంజని బాలసుబ్రమణియన్ (ద్వయం) - కళలు - తమిళనాడు
27. గోపాల్ జీ త్రివేది - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - బీహార్
28. గూడూరు వెంకట్ రావు - వైద్యం - తెలంగాణ
29. హెచ్.వి. హండే - వైద్యం - తమిళనాడు
30. హాలీ వార్ - సామాజిక సేవ - మేఘాలయ
31. హరి మాధబ్ ముఖోపాధ్యాయ (మరణానంతరం) - కళలు - పశ్చిమ బెంగాల్
32. హరిచరణ్ సైకియా - కళలు - అస్సాం
33. హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లర్ - క్రీడలు - పంజాబ్
34. ఇందర్‌జిత్ సింగ్ సిద్ధూ - సామాజిక సేవ - చండీగఢ్
35. జనార్దన్ బాపురావ్ బోథే - సామాజిక సేవ - మహారాష్ట్ర
36. జోగేష్ దేవిరి - ఇతరాలు (వ్యవసాయం) - అస్సాం
37. జుజెర్ వాసి - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - మహారాష్ట్ర
38. జ్యోతిష్ దేబ్‌నాథ్ - కళలు - పశ్చిమ బెంగాల్
39. కె. పజనివేల్ - క్రీడలు - పుదుచ్చేరి
40. కె. రామసామి - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - తమిళనాడు
41. కె. విజయ్ కుమార్ - సివిల్ సర్వీస్ - తమిళనాడు
42. కబీంద్ర పుర్కాయస్థ (మరణానంతరం) - పబ్లిక్ అఫైర్స్ - అస్సాం
43. కైలాష్ చంద్ర పంత్ - సాహిత్యం, విద్య - మధ్యప్రదేశ్
44. కళామండలం విమల మీనన్ - కళలు - కేరళ
45. కేవల్ కృష్ణన్ థక్రాల్ - వైద్యం - ఉత్తర ప్రదేశ్
46. ఖేమ్ రాజ్ సుంద్రియాల్ - కళలు - హర్యానా
47. కొల్లకల్ దేవకి అమ్మ జి - సామాజిక సేవ - కేరళ
48. కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్ - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - తెలంగాణ
49. కుమార్ బోస్ - కళలు - పశ్చిమ బెంగాల్
50. కుమారసామి తంగరాజ్ - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - తెలంగాణ
51. ప్రొఫెసర్ (డా.) లార్స్-క్రిస్టియన్ కోచ్ - కళలు - జర్మనీ
52. లియుడ్మిలా విక్టోరోవ్నా ఖోఖ్లోవా - సాహిత్యం, విద్య - రష్యా
53. మాధవన్ రంగనాథన్ - కళలు - మహారాష్ట్ర
54. మాగంటి మురళీ మోహన్ - కళలు - ఆంధ్ర ప్రదేశ్
55. మహేంద్ర కుమార్ మిశ్రా - సాహిత్యం, విద్య - ఒడిశా
56. మహేంద్ర నాథ్ రాయ్ - సాహిత్యం, విద్య - పశ్చిమ బెంగాల్
57. మామిడాల జగదీశ్ కుమార్ - సాహిత్యం, విద్య - ఢిల్లీ
58. మంగళా కపూర్ - సాహిత్యం, విద్య - ఉత్తర ప్రదేశ్
59. మీర్ హాజీభాయ్ కసంభాయ్ - కళలు - గుజరాత్
60. మోహన్ నగర్ - సామాజిక సేవ - మధ్యప్రదేశ్
61. నారాయణ్ వ్యాస్ - ఇతరాలు (పురావస్తు శాస్త్రం) - మధ్యప్రదేశ్
62. నరేష్ చంద్ర దేవ్ వర్మ - సాహిత్యం, విద్య - త్రిపుర
63. నీలేష్ వినోద్‌చంద్ర మాండ్లేవాలా - సామాజిక సేవ - గుజరాత్
64. నురుద్దీన్ అహ్మద్ - కళలు - అస్సాం
65. ఓతువార్ తిరుత్తణి స్వామినాథన్ - కళలు - తమిళనాడు
66. డాక్టర్ పద్మ గుర్మెట్ - వైద్యం - లడఖ్
67. పల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి - వైద్యం - తెలంగాణ
68. పోఖిలా లెక్తేపి - కళలు - అస్సాం
69. డాక్టర్ ప్రభాకర్ బసవప్రభు కోరే - సాహిత్యం, విద్య - కర్ణాటక
70. ప్రతీక్ శర్మ - వైద్యం - యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
71. ప్రవీణ్ కుమార్ - క్రీడలు - ఉత్తర ప్రదేశ్
72. ప్రేమ్ లాల్ గౌతమ్ - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - హిమాచల్ ప్రదేశ్
73. ప్రోసెన్‌జిత్ ఛటర్జీ - కళలు - పశ్చిమ బెంగాల్
74. డాక్టర్ పుణ్ణియమూర్తి నటేశన్ - వైద్యం - తమిళనాడు
75. ఆర్. కృష్ణన్ (మరణానంతరం) - కళలు - తమిళనాడు
76. ఆర్.వి.ఎస్. మణి - సివిల్ సర్వీస్ - ఢిల్లీ
77. రబిలాల్ తుడు - సాహిత్యం, విద్య - పశ్చిమ బెంగాల్
78. రఘుపత్ సింగ్ (మరణానంతరం) - ఇతరాలు (వ్యవసాయం) - ఉత్తర ప్రదేశ్
79. రఘువీర్ తుకారాం ఖేడ్కర్ - కళలు - మహారాష్ట్ర
80. రాజస్తపతి కాళియప్ప గౌండర్ - కళలు - తమిళనాడు
81. రాజేంద్ర ప్రసాద్ - వైద్యం - ఉత్తర ప్రదేశ్
82. రామారెడ్డి మామిడి (మరణానంతరం) - ఇతరాలు (పశు సంవర్ధన) - తెలంగాణ
83. రామమూర్తి శ్రీధర్ - ఇతరాలు (రేడియో ప్రసారాలు) - ఢిల్లీ
84. రామచంద్ర గోడ్‌బోలే, సునీత గోడ్‌బోలే (ద్వయం) - వైద్యం - ఛత్తీస్‌గఢ్
85. రతిలాల్ బోరిసాగర్ - సాహిత్యం, విద్య - గుజరాత్
86. రోహిత్ శర్మ - క్రీడలు - మహారాష్ట్ర
87. ఎస్.జి. సుశీలమ్మ - సామాజిక సేవ - కర్ణాటక
88. సంగ్యుసంగ్ ఎస్. పొంగెనర్ - కళలు - నాగాలాండ్
89. సంత్ నిరంజన్ దాస్ - ఇతరాలు (ఆధ్యాత్మికత) - పంజాబ్
90. శరత్ కుమార్ పాత్ర - కళలు - ఒడిశా
91. సరోజ్ మండల్ - వైద్యం - పశ్చిమ బెంగాల్
92. సతీష్ షా (మరణానంతరం) - కళలు - మహారాష్ట్ర
93. సత్యనారాయణ్ నువాల్ - వాణిజ్యం, పరిశ్రమలు - మహారాష్ట్ర
94. సవితా పునియా - క్రీడలు - హర్యానా
95. ప్రొఫెసర్ షఫీ షౌక్ - సాహిత్యం, విద్య - జమ్మూ మరియు కాశ్మీర్
96. శశి శేఖర్ వెంపటి - సాహిత్యం, విద్య - కర్ణాటక
97. శ్రీరంగ్ దేవాబా లాడ్ - ఇతరాలు (వ్యవసాయం) - మహారాష్ట్ర
98. శుభా వెంకటేశ అయ్యంగార్ - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - కర్ణాటక
99. శ్యామ్ సుందర్ - వైద్యం - ఉత్తర ప్రదేశ్
100. సిమాంచల్ పాత్రో - కళలు - ఒడిశా
101. శివశంకరి - సాహిత్యం, విద్య - తమిళనాడు
102. డాక్టర్ సురేష్ హనగవాడి - వైద్యం - కర్ణాటక
103. స్వామి బ్రహ్మదేవ్ జీ మహారాజ్ - సామాజిక సేవ - రాజస్థాన్
104. టి.టి. జగన్నాథన్ (మరణానంతరం) - వాణిజ్యం, పరిశ్రమలు - కర్ణాటక
105. తగా రామ్ భీల్ - కళలు - రాజస్థాన్
106. తరుణ్ భట్టాచార్య - కళలు - పశ్చిమ బెంగాల్
107. టెచి గుబిన్ - సామాజిక సేవ - అరుణాచల్ ప్రదేశ్
108. తిరువారూర్ భక్తవత్సలం - కళలు - తమిళనాడు
109. తృప్తి ముఖర్జీ - కళలు - పశ్చిమ బెంగాల్
110. వీళినాథన్ కామకోటి - సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - తమిళనాడు
111. వెంపటి కుటుంబ శాస్త్రి - సాహిత్యం, విద్య - ఆంధ్ర ప్రదేశ్
112. వ్లాదిమిర్ మెస్త్వరిష్విలి (మరణానంతరం) - క్రీడలు - జార్జియా
113. యుమ్నమ్ జాత్రా సింగ్ (మరణానంతరం) - కళలు - మణిపూర్

## సిక్కు తలపాగా ధరించిన పవన్ కల్యాణ్..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదివారం మహారాష్ట్రలోని ప్రఖ్యాత నాందేడ్ తఖ్త్ సచ్ ఖండ్ గురుద్వారాను సందర్శించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో కలిసి ఆయన ఈ పర్యటనలో పాల్గొన్నారు. సిక్కుల పదో గురువు గురు గోవింద్ సింగ్ సమాధి మందిరంలో ఇరువురు నేతలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పవిత్ర చాదర్‌ను సమర్పించారు. గురు తేగ్ బహదూర్ సింగ్ 350వ షాహిదీ సమాగమంలో పాల్గొనేందుకు నాందేడ్ వచ్చిన పవన్ కల్యాణ్, మధ్యాహ్నం సచ్ ఖండ్ గురుద్వారాకు చేరుకున్నారు. గురుద్వారా ఛైర్మన్ డాక్టర్ విజయ్ సత్పాల్ సింగ్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా గురుద్వారా ప్రముఖులు పవన్ కల్యాణ్‌కు సంప్రదాయ సిక్కు తలపాగాను అలంకరించారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి ఫడ్నవిస్‌తో కలిసి ప్రధాన మందిరంలోకి ప్రవేశించారు. గురు గోవింద్ సింగ్ సమాధి వద్ద ప్రార్థనలు చేసి, చాదర్ సమర్పించారు. గురుద్వారా గ్రంథీలు పవిత్ర వస్త్రంతో పవన్ కల్యాణ్, ఫడ్నవిస్‌లను ఆశీర్వదించారు. దర్శనం అనంతరం గురుద్వారా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ డొనేషన్ మెషీన్‌ను వారు ప్రారంభించారు. అంతకుముందు, తొలిసారి గురుద్వారాకు విచ్చేసిన పవన్ కల్యాణ్‌ను సిక్కు మత పెద్దలు ఘనంగా సత్కరించారు. గురుద్వారా జ్ఞాపికతో పాటు, సిక్కులు పవిత్రంగా భావించే కిర్పాన్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ... "గురు తేగ్ బహదూర్ సింగ్ దేశం మొత్తానికి స్ఫూర్తిప్రదాత. ఆయన చేసిన త్యాగం భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. అలాంటి మహనీయుడి షాహిదీ సమాగమంలో పాల్గొనడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను" అని తెలిపారు. సిక్కుల ఐదు అత్యున్నత పీఠాల్లో ఒకటైన ఈ గురుద్వారా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

## కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ వ్యూహం..

త్వరలో జరగనున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ ఎంపీలకు కీలక దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రానికి అత్యధికంగా కేంద్ర నిధులు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీలకు ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలను పార్లమెంట్‌లో బలంగా ప్రస్తావించాలని చంద్రబాబు సూచించారు. ముఖ్యంగా అమరావతి మౌలిక సదుపాయాల అభివృద్ధికి రెండో విడత నిధులు, పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసేందుకు కేంద్ర సహకారం, విశాఖ రైల్వే జోన్‌కు నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, జాతీయ రహదారుల వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇప్పటికే అమరావతికి రూ.15 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. రెండో విడతలో కూడా ఇదే తరహా సాయం కోరుతున్నాం" అని పేర్కొన్నారు. అలాగే, "పోలవరం ప్రాజెక్టును 2027 కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాము. ఆ దిశగా కేంద్రం కూడా సహకరించాలి" అని వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, అధిక నిధులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎంపీలందరూ చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం ఆదేశాలతో, బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ వాణిని బలంగా వినిపించేందుకు టీడీపీ ఎంపీలు సిద్ధమవుతున్నారు.

## ప్రభుత్వ జీతం నాకు వద్దు.. ఒక్క రూపాయి కూడా తీసుకోను

ప్రముఖ యోగా, ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు తన ప్రభుత్వ పదవికి సంబంధించి ఒక ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యోగా, నేచురోపతి విభాగం సలహాదారుగా నియమితులైన ఆయన, క్యాబినెట్ హోదా ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి జీతభత్యాలు గానీ, ఇతర సౌకర్యాలు గానీ స్వీకరించబోనని స్పష్టం చేశారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆయన తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో సీఎం చంద్రబాబు.. మంతెన సత్యనారాయణ రాజును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రభుత్వం చేపడుతున్న 'సంజీవని' వంటి ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేందుకు ఆయన సలహాలు తీసుకోవాలని సీఎం భావించారు. ఈ నేపథ్యంలో మంతెనతో సీఎం చంద్రబాబు దాదాపు 20 నిమిషాల పాటు చర్చించి, పదవిని చేపట్టాలని కోరారు. అయితే, ఈ పదవిని స్వీకరించడానికి తాను మొదట విముఖత చూపినట్లు మంతెన తెలిపారు. కేవలం తెరవెనుక ఉండి సలహాలు ఇస్తానని చెప్పగా, అధికారిక హోదా ఉంటేనే సూచనలకు విలువ ఉంటుందని, పనులు వేగంగా జరుగుతాయని సీఎం చంద్రబాబు నచ్చజెప్పినట్లు వివరించారు. ముఖ్యమంత్రి కోరికను కాదనలేక పదవిని స్వీకరించడానికి అంగీకరించినప్పటికీ, తాను కొన్ని కఠినమైన షరతులు విధించినట్లు మంతెన పేర్కొన్నారు.

"నేను ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా జీతంగా తీసుకోను. ప్రభుత్వ వాహనం సహా ఎలాంటి సౌకర్యాలు వినియోగించుకోను. ఈ నిబంధనలకు అంగీకరిస్తేనే బాధ్యతలు చేపడతాను" అని సీఎంకు తేల్చిచెప్పగా, ఆయన అందుకు సమ్మతించారని మంతెన వెల్లడించారు. గత 35 ఏళ్లుగా తన పుస్తకాలపై వచ్చే ఆదాయంతోనే జీవిస్తున్నానని, తాను నిర్వహిస్తున్న ఆశ్రమం నుంచి కూడా జీతం తీసుకోలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ ధనం ప్రజలదేనని, దానిని స్వీకరించకూడదనేది తన జీవిత నియమమని ఆయన అన్నారు.

## 'మన్ కీ బాత్' లో అనంతపురం గురించి ప్రస్తావించిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు.

2026 సంవత్సరంలో తొలిసారిగా జరిగిన 130వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో ప్రధాని మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా చాలా కాలంగా వర్షాభావ పరిస్థితులతో, నీటి కొరతతో అల్లాడుతోందని గుర్తుచేశారు. ఈ క్లిష్ట పరిస్థితులను అధిగమించడానికి స్థానిక ప్రజలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా, స్వయంగా 'చేతను' అనే కార్యక్రమం ద్వారా జలాశయాల పునరుద్ధరణకు నడుం బిగించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇప్పటివరకు 10కి పైగా చెరువులు, కుంటలను

పునరుద్ధరించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణలో భాగంగా 7 వేలకు పైగా మొక్కలను నాటారని మోదీ వివరించారు. కరవు సీమలో పచ్చదనం నింపేందుకు, భూగర్భ జలాలను పెంచేందుకు వారు చేస్తున్న ఈ సామూహిక కృషి దేశానికే ఆదర్శమని ప్రశంసించారు

## జగన్‌కు ఆ అర్హతే లేదు

- మొదటి పేజి తరువాయి

కాదని, అధికారం కోసమని ఎద్దేవా చేశారు. జగన్ అధికారంలోకి ఉన్న సమయంలో ఇసుక, మైనింగ్, లిక్కర్, భూ కబ్జాలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. అసత్యాలు ప్రచారం చేయడంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేప పధకాలకు కూటమి ప్రభుత్వం అందిస్తున్నా.. వైసీపీ అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు చెబుతున్న అసత్యాలను టీడీపీ నేతలు, కార్యకర్తలు తిప్పికొట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు.

## ఎవరికీ తలవంచం

- మొదటి పేజి తరువాయి

కేంద్ర ఎన్నికల సంఘం టీవీకే పార్టీకి 'విజిల్' గుర్తు కేటాయించిన సంగతి తెలిసిందే. దీన్ని ఆయన ఇక్కడ ఆవిష్కరించారు. 'తమిళనాడు ఎన్నికల్లో ఒంటరిగానే విజయం సాధిస్తాం. అందుకు తగ్గ సైన్యం మావద్ద ఉంది. ఇది ఎన్నికల పోరు కాదు.. ప్రజాస్వామ్య యుద్ధం. అన్నాడీఎంకే ప్రత్యక్షంగా.. డీఎంకే పరోక్షంగా భాజపాకి సరెండర్ అయ్యాయి. టీవీకే ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గదు. డీఎంకే ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చింది. ఎవరికీ తలవంచం.. దేనికీ రాజీపడే ప్రసక్తే లేదు. మనమందరం కలిసికట్టుగా ఉంటే విజయం మనదే. రాష్ట్రంలో అవినీతి అంతానికి సమయం ఆసన్నమైంది' అని విజయ్ అన్నారు. దుష్ట శక్తులను, అవినీతిపరులను ఎదుర్కొనే ధైర్యం తమ పార్టీకి మాత్రమే ఉందన్నారు.

# పెద్ద కలలు కనండి.. సమాజ మార్పులో భాగస్వాములు అవ్వండి





పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

### ప్రజాస్వామ్యానికి ఓటే కీలకం
### జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి.

**పార్వతీపురం, జనవరి 25:స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్.** దేశ పటిష్ట ప్రజాస్వామ్య నిర్మాణానికి ఓటు హక్కు ఎంతో కీలకమని కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి అన్నారు. ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఆర్ సీఎం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టరేట్ వరకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ప్లకార్డులను ప్రదర్శించి ఓటు హక్కు కాదు మన బాధ్యత కూడా, నిజాయితీగా ఓటు వేయండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి నినాదాలతో విద్యార్థినీ, విద్యార్థులు చైతన్య ర్యాలీని నిర్వహించారు.

అనంతరం సభా వేదిక వద్ద అతిథులు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు గురించి ముందే అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఓటును అమ్ముకోకుండా ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని పేర్కొన్నారు. రాబోయే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో కనీసం ఒక్క కుటుంబానికైనా ఓటు విలువను వివరించాలని కోరారు.

విద్యార్థులు కేవలం డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని మాత్రమే కాకుండా, దేశాన్ని నడిపించే నాయకులు కావాలని కూడా కలలు కనాలని పిలుపునిచ్చారు. అనుకుంటేనే ఏదైనా సాధ్యమవుతుంది" అని విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.

దేశంలో ప్రతి ఏటా 80 లక్షల మంది డిగ్రీ పూర్తి చేస్తున్నా, ఐఏఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలకు కేవలం 5 లక్షల మంది మాత్రమే దరఖాస్తు చేస్తున్నారని, మిగిలిన వారంతా కనీసం ప్రయత్నం చేయకుండానే ఓటమిని ఒప్పేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయం అంటే భయం వదిలి, ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలని, ప్రజల మెప్పు పొందితే ఎవరైనా ప్రజాప్రతినిధులు కావచ్చన్నారు.

యువత ఓటు హక్కు నమోదుతో పాటు ఓటు హక్కు లేని వారికి ఓటరుగా నమోదు చేయడంలో భాగస్వా మ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యం పరిడవిల్లాలని ఆకాంక్షించారు.

అనంతరం సీనియర్ సిటిజన్ ఓటర్లను సన్మానించారు. కొత్త ఓటర్ల నమోదులో సమర్థవంతంగా పనిచేసిన బిఎల్వోలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం, ఉపన్యాసం వంటి పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అంద జేశారు.

మహాత్మా జ్యోతి రావ్ పూలె బి సి వెల్ఫర్ ఆశ్రమ పాఠశాల విద్యార్థినీలు ఓటు హక్కు ప్రాధాన్యత వివరిస్తూ ఒక నాటిక ప్రదర్శించారు. జూనియర్ కళాశాల విద్యార్థినులు వాసవి, మోనికా వైష్ణవి ఓటు హక్కు యొక్క ప్రముఖ్యత వివరించారు కార్యక్రమంలో పార్వతీపురం పాలకొండ సబ్ కలెక్టర్లు వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్,జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, వివిధ శాఖల జిల్లా అధికారులు తహశీల్దార్ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## గ్రామాల అభివృద్ధి తమ ధ్యేయం

- రాములు గ్రామంపై ప్రేమ తగ్గబోదు.
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జెవివిఎన్ మూర్తి.
- వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 25.** గ్రామాల అభివృద్ధి తమ ధ్యేయం అని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైసిపి నేత జెవివిఎన్ మూర్తి అన్నారు. మండలంలో గల కించాయిపుట్టు పంచాయితీ రాములు గ్రామంలో వైసిపి మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి గోల్లోరి సన్యాసిరావు తో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి వైసిపి నేత మూర్తి మాట్లాడుతూ.. రాములు గ్రామం పై ఎప్పుడూ ప్రేమ ఉంటూనే ఉంటుందని అది ఎప్పుడూ తగ్గబోదని, ఆ గ్రామ అభివృద్ధి ధ్యేయంగా జడ్పీ చైర్పర్సన్ సుభద్ర పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ముందుగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తాము అడగకుండానే గతంలో జడ్పీ నిధులు ద్వారా సిసి రోడ్డు మంజూరు చేశారని, ఇప్పుడు కూడ తాము అడగకుండానే వైసిపి నేత మూర్తి తమ గ్రామానికి వచ్చి సమస్యలను తెలియ జేయమని అడుగుతున్నారన్నారు. తమ గ్రామ అభివృద్ధి కోసం పనిచేస్తున్న చైర్ పర్సన్ సుభద్రకు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఇదే క్రమంలో గ్రామస్తులు సిసి రోడ్డు నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. దీంతోపాటు గ్రామాభివృద్ధికి సంబంధించిన పనులు, కొన్ని సమస్యలను మూర్తి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామస్తులు తెలియజేసిన సమస్యలను పరిష్కరిస్తామని, సిసి రోడ్డు నిర్మాణానికి జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేయించే బాధ్యతను తాను తీసుకుంటానని మూర్తి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారానికి కట్టుబడి ఉంటామని పద్మారావు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి గొల్లోరి సన్యాసిరావు, చెండా పాపారావు, పంచాయతీ కో-ఆర్డినేటర్ గంపరాయి ధనార్జన్, రొబ్బ రాజారావు గ్రామస్తులు పాల్గొన్నారు.



## తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు.

- డిగ్రీ కాలేజీలో ఘనంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలు.
- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం.

**అరకులోయ పెన్ పవర్ 25:** నియోజకవర్గం మండల కేంద్ర పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాలేజ్ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా పరిపాలించబడుతుందంటే దానికి కారణం ఓటు హక్కు ఉండడమేనని అన్నారు. గతంలో మన భారత దేశంలో రాజరిక పాలన ఉండేదని గుర్తు చేసి, ప్రభుత్వం అనేది ప్రజల యొక్క ఓటు ద్వారా ఏర్పాటు చేసినట్లయితే, మన ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు పరిపాలన చక్కగా అందుతుందనే ఉద్దేశంతో ఓటు హక్కును 18 ఏండ్లు నిండిన వారికి కల్పించడం జరిగింది. మన దేశానికి రాజ్యాంగం రాసే ముందు కూడా జాతీయ నేతలైన జాతిపిత మహాత్మా గాంధీ పన్నులు ఎవరైతే చెల్లిస్తారో వారికే ఓటు హక్కు ఉండాలని, జవహర్ లాల్ నెహ్రూ రాజ కుటుంబాలకు 100 ఎకరాలు ఉన్నవారికి మాత్రమే ఓటు హక్కు ఉండాలని గట్టిగా వాదించారని భారత దేశంలో ఉండే ప్రతి మనిషికి ఒకే విలువ ఉండాలనే సిద్ధాంతాన్ని నమ్మి రాజ్యాంగం ద్వారా 18 సంవత్సరాలు నిండిన వయోజనులందరికీ ఓటు హక్కును "రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించారని గుర్తు చేశారు. వార్డు మెంబర్ నుండి మొదలుకొని దేశంలోని అత్యున్నత స్థాయి రాష్ట్రపతి పదవి కూడా ఓటు ద్వారానే ఎన్నికవుతున్నారని అన్నారు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నీతివంతమైన పరిపాలన జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. కానీ ప్రస్తుత సమాజంలో నీతివంతమైన పరిపాలన జరగట్లేదని వాపోయారు. యువత తలుచుకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థలో నీతివంతమైన పరిపాలన సాధ్యమే అని అన్నారు. ఎందుకంటే తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు దాగి ఉందని, దానికి అనుగుణంగా విద్యార్థుల ఆలోచనలతో వ్యవస్థలో మార్పులు తీసుకురావచ్చని అన్నారు. రాబోయే రోజుల్లో మీలాంటి యువత అత్యున్నతమైన ఆలోచనలతో భారతదేశానికి మంచి భవిష్యత్తుని ఇవ్వాలని ఈ 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు నిలిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా ఇన్చార్జి ఆర్డీవో లోకేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భరత్ నాయక్. ప్రభుత్వ డిగ్రీ మహిళ కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు. డిఆర్ఓ (ఇన్చార్జ్) పి. అంబేద్కర్. మండలం టౌన్ ఎంపీటీసీ సభ్యులు దురియ ఆనంద్ కుమార్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
## ఓటు హక్కుపై అవగాహన సదస్సు



-4లో

## గిరిజన క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాము

### అరకు ఎంపీ గుమ్మ తనుజారాణి

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జనవరి 24:** గిరిజన క్రీడాకారులకు ఎల్లప్పుడూ తన కుటుంబంతో పాటు అండగా ఉంటానని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణి తెలిపారు. శనివారం అంబేద్కర్ ఇండోర్ స్టేడియం పునఃప్రారంభోత్సవాన్ని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తో కలిసి ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎంపీ నిధుల నుంచి 25 లక్షల రూపాయలు అందజేసినట్లు తెలిపారు. గిరిజన యువతకు క్రీడల్లో శిక్షణ పొందేందుకు, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ స్టేడియం కీలకంగా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇండోర్ స్టేడియం పాడైపోయినా, గిరిజన క్రీడాకారులు క్రీడల్లో ముందుండాలని భావిస్తూ ఆటను కొనసాగించే దృఢ సంకల్పంతో ఆమె స్టేడియానికి మరమ్మత్తులు చేయించాలనుకుని ఈ పనులను చేపట్టారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అంబేద్కర్ ఇండోర్ స్టేడియం పునఃప్రారంభం చాలా సంతోషకరమైనదని పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడు స్టేడియాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటిడిఏ పీవో తిరుమణి శ్రీపూజ,మాజీ ఎమ్మెల్యే గిడ్డిశ్వరి, ఎంపీ భర్త, సీనియర్ వైసీపీ నాయకులు శెట్టి వినయ్ స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, స్కూలు యాజమాన్యం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆర్వి నగర్‌లో బస్టాండ్ నిర్మాణం కోసం ఎంపీకి వినతిపత్రం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం జీకే విధి పంచాయతీకి చెందిన ఆర్వి నగర్ గ్రామస్తులు, తమ గ్రామంలో బస్ షెల్టర్ (బస్టాండ్) నిర్మించాల్సిందిగా అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజ రాణికి వినతిపత్రం సమర్పించారు. గతంలో ఆర్వి నగర్ లో బస్టాండ్ ఉండేదని భారీ వర్షాలలో బస్టాండ్ పై చెట్టు పడిపోవడంతో మొత్తం బస్టాండ్ కూలిపోయిందని, దీంతో ప్రయాణికులు బస్ షెల్టర్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అందుకే ఎంపీ స్పందించి గ్రామంలో బస్టాండ్ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అరికట్ట అంజి, గ్రామస్తులు రాజారావు, నీలకంఠం, అర్జున్, నాగేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం ఓటు హక్కుపై అవగాహన సదస్సు







**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్. విజయనగరం, జనవరి 25:** నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళా పోలీస్ స్టేషన్ నుండి కలెక్టరేట్ వరకు ఓటర్ల అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సందేశాన్ని చదివి వినిపించారు. ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు.

ప్రజాస్వామ్యానికి వెన్నెముక ఓటు: ఆర్డీవో కీర్తి



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో డి.కీర్తి మాట్లాడుతూ, 2010 నుండి దేశవ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. రాజ్యాంగం అమలులోకి రావడానికి ఒకరోజు ముందే ఎన్నికల కమిషన్ ఏర్పడిందని, అప్పటి నుండి ప్రజాస్వామ్య పరిరక్షణలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. మతం, కులం, జాతి, భాష అనే భేదాలు లేకుండా అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎన్నికల్లో 70 శాతం మంది మాత్రమే పాల్గొంటున్నారని, మిగిలిన వారిని కూడా చైతన్యపరిచి స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగే ఎన్నికల్లో భాగస్వాములను చేయాలని ఆమె కోరారు.

సుస్థిర ప్రభుత్వానికి ఓటే ఆధారం: ఎస్డీసీ వెంకటేశ్వరరావు

ఎస్డీసీ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఓటు ద్వారానే సుస్థిర ప్రభుత్వం సాధ్యమవుతుందన్నారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడంలో ఓటర్ల దినోత్సవం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ముందుగా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా అత్యధిక సార్లు ఓటు వేసిన వృద్ధులను, ఓటింగ్‌లో పాల్గొన్న ట్రాన్స్‌జెండర్లను అధికారుల బృందం ఘనంగా సన్మానించింది. అనంతరం ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ లో సెల్ఫీలు దిగారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అప్పలరాజు, డీఈవో మాణిక్యం నాయుడు, తహసీల్దార్లు, బీఎల్వోలు మరియు ఇతర ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అరసవెల్లికి విశ్వఖ్యాతి తెస్తాం పియుసి ఛైర్మన్ కూన రవికుమార్





**అరసవెల్లి, జనవరి 25స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్. :** భానుడి క్షేత్రమైన అరసవెల్లిని ప్రపంచస్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని అసెంబ్లీ పీఏసీ ఛైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. రథసప్తమి వేడుకల సందర్భంగా ఆయన స్వామివారిని ఆదివారం ఉదయం దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో హిందూ ఆచారాలు, సనాతన ధర్మంపై దాడులకు పాల్పడిందని విమర్శించారు. దానికి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం ధర్మాన్ని రక్షిస్తూ నవ సమాజ నిర్మాణం కోసం పాటుపడుతోందన్నారు. రథసప్తమి వేడుకలను ఈసారి ఏడు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించడంపై జిల్లా ప్రజల తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సూర్యభగవానుడికి నిత్య పూజలు ఒక్క శ్రీకాకుళంలోనే జరగడం మన జిల్లా ప్రజల అదృష్టమని ఆయన కొనియాడారు.

# ఓటు హక్కును నిర్భయంగా వినియోగించాలి

★ దామనాపల్లిలో ఘనంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం




**గూడెం కొత్తవీధి/పెన్ పవర్, జనవరి 25:** ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని దామనాపల్లి పంచాయతీ విఆర్ఓ తగ్గి రామారావు అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని దామనాపల్లిలో సీనియర్ సిటిజన్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. మన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకున్నప్పుడే నిజమైన స్వరాజ్యం సిద్ధిస్తుందని అన్నారు. ఓటు హక్కు వినియోగించే ముందు అభివృద్ధి చేస్తారని నమ్మకం ఉన్న అభ్యర్థులను ఎంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తగ్గి కృష్ణారావు, పేసా గ్రామ కమిటీ సభ్యులు కర్రయ్య, గ్రామ పెద్దలు కుందేరి నాగరాజు, పల్లంనాయుడు, మాదల సతీష్, మత్య రాజు, డిజిటల్ అసిస్టెంట్ బేరా సింహాచలం, మహిళా పోలీసు రమణమ్మ, వెటర్నరీ అసిస్టెంట్ సత్యనారాయణతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో ర్యాలీ కూడా నిర్వహించారు.

# జీకే వీధి వెలుగు ఏపీఎం ఆకస్మిక మృతి



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, జనవరి 26:** అల్లూరి జిల్లా గూడెం కొత్తవీధి వెలుగు ఏపీఎంగా పనిచేస్తున్న సూర్యారావు ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం విధి నిర్వహణ నిమిత్తం పాడేరు జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన, రాత్రి సమయం కావడంతో స్థానిక లాడ్జిలో బస చేశారు. ఆదివారం ఉదయం లాడ్జి సిబ్బంది ఆయన గదిలో ఎలాంటి కదలికలు లేకపోవడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సూర్యారావును పాడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విజయనగరం జిల్లా రాజాంకు చెందిన సూర్యారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, వెలుగు ఉద్యోగులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# ఉత్సవ ఉత్సాహాన్ని రెట్టింపు చేసిన చాపర్ రైడ్- ఛాపర్ పైలట్లను సన్మానించిన రామ్మోహన్ నాయుడు










**జనవరి 25 స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్.:** హెలికాప్టర్ రైడింగ్ అరసవల్లి ఉత్సవాలకు మరింత వన్నె తెచ్చాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రాష్ట్ర పండుగ హోదాలో జరుగుతున్న అరసవల్లి రథసప్తమి ఉత్సవాల సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని హెలికాప్టర్ రైడింగ్ ను శ్రీకాకుళం లో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఏడు రోజుల పాటు శ్రీకాకుళం పరిసర ప్రాంత వాసులను ఈ హెలి టూరిజం కొత్త అనుభూతులను మిగిల్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం నాడు హెలి రెడ్లు జరుగుతున్న తీరును స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ తో కలసి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. నగరంలోని ఆర్ అండ్ బి బంగ్లా లోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుని ఛాపర్ సిబ్బందితో మాట్లాడారు. మంచి అనుభూతులను స్థానికులకు మిగిల్చారని.. విరామం లేకుండా వినోదాన్ని అందించారని పైలట్లను అభినందించారు. హెలి టూరిజం పట్ల ప్రజల నుండి ఎలాంటి స్పందన వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఛాపర్ సిబ్బందిని సత్కరించారు. జ్ఞాపకానికి గుర్తుగా వారితో ఫోటో దిగారు.

# ఉత్సవాలు మన మూలాలు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.







**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్. అరసవిల్లి జనవరి 25 :** దేశంలోనే పూజలు జరిగే ఏకైక సూర్యదేవాలయం అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో సూర్యజయంతి వేడుకలను రాష్ట్ర పండుగ హోదాలో ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని.. ఉత్సవాలు మన మూలాలు అని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆదివారం నాడు అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో రథసప్తమి సందర్భంగా రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, అనిత, ఎంపి కలిశెట్టి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్, జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలసి పట్టువస్త్రాలను సమర్పించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన రామ్మోహన్ నాయుడును ఆలయ అధికారులు స్వాగతం పలికారు. పట్టువస్త్రాలతో అలయంలోపలికి ప్రవేశించి క్షీరాభిషేక సేవలో పాల్గొన్నారు. రథసప్తమి సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అనంతరం మీడియా తో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. సూర్యున్ని ఆరాధించే ప్రతీ భక్తునికి సూర్యజయంతి శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర పండుగ హోదాలో జరిపేందుకు తోడ్పాటు అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాలను చరిత్రలో నిలచేలా చెయ్యాలని ముందుగానే సంకల్పించామని.. ఆ స్థాయిలో తోడ్పాటు అందించిన అధికారులు, పోలీసులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్, జిల్లా కలెక్టర్, ఎస్పి, ఇతర అధికారులందరి సమిష్టి కృషితో.. సొంత కార్యక్రమంగా అందరూ భావించి అట్టహాసంగా ఉత్సవాలను నిర్వాహించుకోగాలిగామని అన్నారు.

సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ.. సత్వర దర్శనం జరిగేలా ఈ ఏడాది ఏర్పాట్లు చేశామని, క్యు లైన్లలో కూడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమగ్ర సమీక్షలు, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని తెలిపారు. భక్తులందరూ ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలని కోరారు.

ఆఖరి రోజు వినోద కార్యక్రమాలలో సంగీత దర్శకుడు తమన్ కార్యక్రమం న భూతో న భవిష్యతి అన్న రీతిలో ఉందని కితాబిచ్చారు.

ప్రపంచంలో పలు దేశాలు అభివృద్ధి చెందాయని భావిస్తున్నప్పటికీ వాటి భవిష్యత్ పై ఇంకా అనుమానాలు ఉండనే ఉన్నాయని.. ఆధ్యాత్మికతతో కూడిన అభివృద్ధి సాధిస్తున్న భారతదేశం భవిష్యత్ అంతా అద్భుతంగా ఉండబోతోందని అన్నారు.

అరసవల్లి ఆలయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వ నిధులతో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రసాద్ పథకంలో అరసవల్లి ఆలయాన్ని చేర్చి అభివృద్ధి చేసే భాద్యతను తాను తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ప్రధాని మోదీ తోడ్పాటు, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ ల పూర్తి సహకారంతో త్వరలోనే ఈ కల సాకారం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఇంపాసిబిల్ అన్న పదాన్ని.. ఈ పద్దెనిమిది నెలల్లో పాసిబిల్ చేశామని అన్నారు. పవర్ ఫుల్ జోడి కేంద్రంలో, రాష్ట్రంలో నాయకత్వం వహిస్తున్న నేపధ్యంలో మంచి సంకల్ప బలంతో రాష్ట్రం ముందుకు వెళ్తోందని రామ్మోహన్ నాయుడు అన్నారు.

# అభివృద్ధికి చిరునామాగా కూటమి ప్రభుత్వం నిలుస్తుంది-ఎమ్మెల్యే కూన రవికుమార్







**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్..**ఆమదాలవలస మండలం బొబ్బిలిపేట గ్రామంలో పలు రహదారుల నిర్మాణాలకు ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ ఆదివారం శంకుస్థాపన చేసారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి రహదారుల నుంచే ప్రారంభమవుతుందని, ప్రతి గ్రామానికి నాణ్యమైన రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కూన రవికుమార్ తెలిపారు.

బొబ్బిలిపేట నుంచి వెదుర్లవలస వరకు రూ.1.80 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించనున్న రహదారి పనులకు శంకుస్థాపన చేసి అనంతరం 53 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రహదారి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు నిర్మాణం చేపట్టడం ద్వారా గ్రామాల మధ్య రాకపోకలు సులభం చేయడమే కాకుండా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడంలో ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ధ్యేయంగా పని చేస్తోందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యం కల్పించి ప్రతీ గ్రామం అభివృద్ధి చెందేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆర్ అండ్ బి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సామాన్యుల చెంతకే న్యాయ సహాయం







- ప్రజల ముంగిటకే న్యాయమూర్తులు రాక
- న్యాయమూర్తికి, ప్రజలకు మధ్య అంతరాన్ని తొలగించడమే లక్ష్యం
- న్యాయమూర్తులను అధికారిగా భావించి సమస్యలు పరిష్కరించుకోండి
- న్యాయ,రెవిన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- ప్రజలకు సేవ చేసేందుకు పారా లీగల్ వాలంటీర్లు
- ప్రభుత్వ పథకాలను పటిష్టంగా అమలుచేయాలి
- ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ సిహెచ్.మానవేంద్రనాధ్ రోయ్ వెల్లడి

**పార్వతీపురం, స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్.జనవరి 25** : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ,రెవిన్యూ శాఖ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను పటిష్టంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ సిహెచ్.మానవేంద్రనాథ్ రోయ్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని రెవిన్యూ క్లినిక్ వద్ద ఉచిత న్యాయ సహాయ కేంద్రం (లీగల్ ఎయిడ్ క్లినిక్) ప్రారంభోత్సవ కార్యక్రమం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాలకు న్యాయ సేవలను ఉచితంగా అందించే లక్ష్యంతో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో 'లీగల్ ఎయిడ్ క్లినిక్'ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతి సోమవారం పారాలీగల్ వాలంటీర్లు, న్యాయసేవ సహాయకులు ఇక్కడ అందుబాటులో ఉంటారని అన్నారు. సమస్యలు ఉన్న వారంతా ఇక్కడకి వస్తే, అర్జీ రాయడం దగ్గర నుంచి సమస్య పరిష్కారం అయ్యేవరకు సహాయ సహకారాలు అందిస్తారని వివరించారు. వారు అందించే సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. దీనిపై ఎటువంటి సందేహాలు ఉన్నా స్థానికంగా ఉండే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లేదా పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవా సహాయకులను సంప్రదించాలని సూచించారు. న్యాయమూర్తికి, ప్రజలకు మధ్య గల అంతరాన్ని తొలగించడమే దీని లక్ష్యమని, అందులో భాగంగా న్యాయమూర్తులే ప్రజల ముంగిటకు వచ్చి, ప్రజలతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పించామని చెప్పారు. న్యాయమూర్తులను ఒక జడ్జిలా కాకుండా ఒక అధికారిగా భావించి సమస్యలు తెలియజేసి, వాటికి పరిష్కారం పొందాలని స్పష్టం చేశారు. సివిల్, క్రిమినల్ కేసుల సలహాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన, లోక్ అదాలత్ ద్వారా వివాదాల పరిష్కారం వంటి సేవలు ఇక్కడ ఉచితంగా లభిస్తాయన్నారు.

జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వస్తున్న భూ సమస్యల్లో సుమారు 9 శాతం కేసులు సివిల్ మరియు కుటుంబ వివాదాలకు సంబంధించినవిగా ఉండటంతో, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఈ ప్రత్యేక చర్యలలో భాగంగా జిల్లాలో భూ మరియు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కు అనుబంధంగా జిల్లా యంత్రాంగం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి సౌజన్యంతో జిల్లాస్థాయిలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ను ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా పేద, నిరుపేద, బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు, న్యాయ అవగాహన అందించబడుతుందని అన్నారు. ప్రీ-లిటిగేషన్ దశలో ఉన్న భూ వివాదాలను కోర్టుకు వెళ్లకుండా స్నేహపూర్వకంగా పరిష్కరించడమే ఈ క్లినిక్ యొక్క ప్రధాన లక్ష్యమని చెప్పారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు, రెవెన్యూ క్లినిక్ తో సమాంతరంగా నిర్వహించబడు తుందని స్పష్టం చేశారు. ఈ క్లినిక్ లో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సీనియర్ అడ్వకేట్లు మరియు పారా లీగల్ వాలంటీర్లు న్యాయ సేవలు అందిస్తారని, భూ రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్లు వంటి డాక్యుమెంట్లను పరిశీలించి, సమస్య స్వభావాన్ని గుర్తించి తగిన న్యాయ సలహా అందించబడుతుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, సహ యజమానుల మధ్య ఉన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ప్రయత్నాలు చేయబడతాయని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో అనుకూలమైన కేసులను లోక్ అదాలత్ లకు రిఫర్ చేసి త్వరిత పరిష్కారం కల్పించబడుతుందని అన్నారు. తప్పనిసరిగా కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో, అర్హులైన పిటిషనర్లకు ఉచిత న్యాయ సహాయం, పిటిషన్ల తయారీ, కేసు దాఖలు వంటి సేవలు అందించబడతాయని చెప్పారు.కోర్టులో పెండింగ్ లో ఉన్న సివిల్ దావాలు, కుటుంబ వివాదాలు, ట్రైన్డ్ మీడియేటర్స్ కి రిఫర్ చేసి మీడియేషన్ ద్వారా పరిష్కరించు కోవచ్చని, తద్వారా వృధా ఖర్చులు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రస్తుతం 14 మంది సీనియర్ అడ్వకేట్లు మరియు 20 మంది పారా లీగల్ వాలంటీర్లు ఈ సేవల కోసం అందుబాటులో ఉన్నారని, సివిల్ మరియు కుటుంబ వివాదాల వల్ల ఎన్నేళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్ ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని భావిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. భూ సమస్యలు ఉన్న అర్హులైన పిటిషనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యంత్రాంగం కోరింది.

ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత, రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఏఎస్పీ వి.మనీషా రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్,

డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు,తహసీల్దార్లు, న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి టిఫిన్ చేసిన







- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 25:**పేద విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు.ఆదివారం విశాఖ నగరంలోని సీతమ్మధార సాంఘిక సంక్షే మ బాలుర వసతి గృహంలో మంత్రి డిఎస్ బీవీ స్వామి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వంటగది, మరుగు దొడ్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి సమా వేశం నిర్వహించి, వారికి అందుతున్న మెనూ, వసతులు, ఎదురవుతున్న సమస్యలపై వివ రాలు అడిగి తెలుసుకున్నారు.తనిఖీ అనం తరం మంత్రి విద్యార్థులతో కలిసి టిఫిన్ చేయ డం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హాస్టల్‌లో నిర్వహణ, పరిశుభ్రత, విద్యార్థులకు అంది స్తున్న సౌకర్యాల పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతున్న సమయంలో పుట్టుకతోనే కాళు ,, చేతులు వంకరలతో బాధపడుతున్న మారిపల్లి చందు అనే విద్యార్థిని మంత్రి గమనించారు. వెంటనే ఆ విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని వీడియో కాల్ ద్వారా ప్లాస్టిక్ సర్జరీ నిపుణుడు డాక్టర్ సుబ్బారెడ్డికి వివరించారు. విద్యార్థికి అవసరమైన చికిత్సను పూర్తిగా ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్య లు తీసుకుంటుందని మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి హామీ ఇచ్చారు.పేద వి ద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, వారి ఆరోగ్యం, భవిష్యత్తు పై ప్రభుత్వం పూర్తిస్థాయి శ్రద్ధ చూపుతోందని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మన అరణ్యాలను మనమే కాపాడుకోవాలి

- సమస్త జీవరాసిని పరిరక్షించాలి.
- ఏ జీవి అంతరించినా మానవాళికే నష్టం
- విశ్వంలో జీవరాశితో వేరొక గోళం లేదు
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం





**విశాఖ పెన్ పవర్ జనవరి 25**

మన అరణ్యాలను మనమే కాపాడుకోవాలి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పెందుర్తి లోని బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహం వద్ద కూరగాయల, పండు అరటి మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. సమస్త జీవరాసిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఏ జీవి అంతరించినా మానవాళికి మనుగడే లేదు అనె అంశాన్ని గుర్తు ఉంచుకోవాలి అని వివరించారు. ఒక జీవితో మరొక జీవికి సంబంధం కలిగి ఉంటుంది అన్నారు. జీవావరణ చక్రంలో ఏ జీవి అంతరించినా మానవాళికే నష్టం అనే అంశం గుర్తించి సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి అని వివరించారు. విశ్వంలో జీవరాశితో వేరొక గోళం లేదని, ఈ ఒక్క భూగోళం సమస్త జీవరాశితో కళకళలాడుతూ ఉండేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి అని అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సత్యవతి, పలువురు విద్యార్థినులు మాట్లాడారు.

## కేజీబీవీలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆటల పోటీలు!





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 25:** గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దేరాలలోని కేజీబీవీ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల విద్యార్థినులు,టీచర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఆటల పోటీలు మ్యూజికల్ చెయిర్,స్కిప్పింగ్,ఖో-ఖో,షాట్‌పుట్,పరుగుపోటీ,డిస్కస్ త్రో పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు.

## 200 సామూహిక వివాహాలకు దరఖాస్తుల ఆహ్వానం


Daanadharma.org
సామూహిక వివాహ దరఖాస్తు
శ్రీ దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ (రిజిష్టర్ నం. 204/2019)
& వికాసతరంగిణీ వారి దివ్యసముఖమునకు
తేది :
వరుడి వివరములు :
పేరు : ........ ఫోన్ నం. ........
పుట్టినతేది : ........ వయస్సు: ........ ఆధార్‌నం : ........
కులము : ........ గోత్రము : ........
తండ్రి పేరు : ........ ఫోన్ నం. ........
గ్రామం: ........ మండలము: ........ జిల్లా : ........
రాష్ట్రము : ఆంధ్రప్రదేశ్.
వధువు వివరములు :
పేరు : ........ ఫోన్ నం. ........
పుట్టినతేది : ........ వయస్సు: ........ ఆధార్‌నం : ........
కులము : ........ గోత్రము : ........
తండ్రి పేరు : ........ ఫోన్ నం. ........
గ్రామం: ........ మండలము: ........ జిల్లా : ........
రాష్ట్రము : ఆంధ్రప్రదేశ్.
పైన తెలిపిన మా ఇరువురికి ఇంతకుపూర్వము వివాహము కాలేదు. పెద్దల ఆశీస్సులతో జరుగు ఈ సామూహిక వివాహ మహోత్సవములో మమ్ములను ఒక జంటగా ఆశీర్వదించ ప్రార్థన.
ఇది మా ఇరువురి కుటుంబ సభ్యులము కలిసి ఇష్టపూర్వకముగా ఇస్తున్న వాంగ్మూలము.
వరుడి సంతకము : ........ వధువు సంతకము: ........
వరుడి ఫోటో
వధువు ఫోటో
సమన్వయ కర్త పేరు ........
ఫోన్ నం. ........
సంతకము ........
వివాహమును బలపరుస్తూ గ్రామ సర్పంచ్ సంతకం
వివాహమును బలపరుస్తూ వి.ఆర్.ఓ. సంతకం

**గూడెం కొత్తవీధి/పెన్ పవర్, జనవరి 25:** గూడెం కొత్తవీధి మండలంలో శ్రీ త్రిదండి చిన్నజియార్ స్వామి వారి దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 200 సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు వివాహ వ్యయభారం భరించలేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, వారికి అండగా నిలిచే ఉద్దేశంతో ఈ సామూహిక వివాహాలను నిర్వహించనున్నట్లు అర్చకులు వెల్లడించారు. వివాహాలు చేసుకోవాలనుకునే అర్హత కలిగిన జంటలు దరఖాస్తులను పూర్తి చేసి, క్రింద పేర్కొన్న జైశ్రీరామ్ సభ్యులకు అందజేయాలని వారు కోరారు. సామూహిక వివాహాల్లో పాల్గొనే నూతన జంటలకు వస్త్రాలు, దండలు, తాళి, మెట్టెలు తదితర పూజా సామగ్రిని ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు వివరాల కోసం 8500719811, 6303477680, 9492673017, 7382294051 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## రౌడీ షీటర్‌కు ఆటో అందజేసిన సీతం రాజు సుధాకర్

- వన్‌టౌన్ సీఐ పూడి వరప్రసాద్ చేతుల మీదుగా ఆదివారం ప్రారంభం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 25 :** సామాజిక పునరావాసంలో భాగంగా రౌడీ షీటర్‌కు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా సీతం రాజు సుధాకర్ కీలక ముందడుగు వేశా రు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో రౌడీ షీటర్‌కు ఆటోను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వన్‌టౌన్ సీఐ పూడి వరప్రసాద్ హాజ రై, లబ్ధిదారుడికి ఆటో తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తప్పి దాల నుంచి దూరంగా ఉండి సమాజంలో గౌరవ ప్రదమైన జీవనం సాగించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు నేరప్రవృత్తి తగ్గేందుకు దోహదపడతాయని తెలిపారు.

సీతం రాజు సుధాకర్ మాట్లాడుతూ, ఉపాధి కల్పన ద్వారా మార్పు సాధ్యమని, సమాజంలో ప్రతి ఒక్కరికీ రెండో అవకాశం అవసరమని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి ఉత్సవాలు





**గాజువాక: పెన్ పవర్, జనవరి 25:** జీవీఎంసీ 65వ వార్డు భానోజీ తోట గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా స్వామినీ వారికి సూర్యనారాయణ స్వామి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగినది .అనంతరం వచ్చిన భక్తులకు 14 రకాల వంటలతో అన్న ప్రసాద వితరణ ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో భారీగా అన్నప్రసాద వితరణ ఆలయ సేవకులు ఆర్థిక సహాయంతో రథసప్తమికి విరాళాలు ఇచ్చిన భక్తుల నుండి అన్న ప్రసాద వితరణ చేశారు. సుమారు 5000 మంది భక్తులు ఈ అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 5 గంటల నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు అర్చనలు ఆలయ ప్రధాన అర్చకులు ద్వారా నిర్వహించారు . ముఖ్య అతిథులు మాట్లాడుతు ఆలయం శంకుస్థాపన నేటికీ ఎనిమిది సంవత్సరాల పూర్తయి తొమ్మిదో సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భముగా అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉత్తర ద్వారంలో వెలసిన రెండవ దేవాలయం వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం ఇది రెండవది ఏడు వారాలు వెంకటేశ్వర స్వామికి ముడుపులు కట్టి ఎనిమిదవ వారం ముక్కు చెల్లించుకున్న వారికి వెంకటేశ్వర స్వామి ఉంటుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ప్రియదర్శిని కాలనీ కోలాట టీం ద్వారా కోలాటం నిర్వహించారు. కూచిపూడి భరతనాట్యం చిన్నారుల అత్యంత రమ్యంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి ఈశ్వరి, గౌరుసు రామలక్ష్మి, పూడి శాంతి, జిత్తుల లక్ష్మి ,పప్పల ఆది లక్ష్మి రామలక్ష్మి, పెంటకోట రాజు మరియు ఆలయ సేవకులు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

# యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా అప్పలనాయుడు



**నర్సీపట్నం, పెన్ పవర్ (జనవరి 25) :** అనకాపల్లిజిల్లా నర్సీపట్నం నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా గొలుగొండ మండలం ఏటిగైరంపేటకు చెందిన పాము అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలోని జిల్లేడుపూడి నూకాంబిక ఆలయం వద్ద యలమంచిలి వేణు అధ్యక్షతన ఆదివారం జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు భరణికాన బాబూరావు, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు భరణికాన రామారావు , అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు భరణికాన నరసింహమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సబ్బి శ్రీనివాసరావు, కరక సోమునాయుడు, నాయకులు లండా అప్పన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఈగల అప్పారావు ( బంకు అప్పారావు), ఉపాధ్యక్షుడిగా పక్కుర్తి సత్యనారాయణ ( నగరం) లు ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, నర్సీపట్నం మండలం అధ్యక్ష కార్యదర్శులుగా గడదాసు రాజు, బర్ల కృష్ణంరాజు, మాకవరపాలెం మండలం అధ్యక్ష కార్యదర్శులుగా మురుకుర్తి ఈశ్వర రావు, వైభోయిన నానాజీ, గొలుగొండ మండలం అధ్యక్ష కార్యదర్శులుగా గొంప వాసు, పట్నాల సత్తిబాబు, నాతవరం మండలం అధ్యక్ష కార్యదర్శులుగా మువ్వల నాగ సత్యనారాయణ, బంధం రాంబాబు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భరణికాన బాబూరావు మాట్లాడుతూ యాదవ సంఘం అధ్యక్షునిగా మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్నానని, ఈ పదవీకాలంలో అనేక సేవా కార్యక్రమాలు సంఘం తరపున చేపట్టామన్నారు. ముఖ్యంగా జిల్లాలోని పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించామన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న జిల్లాలోని అనేక యాదవ కుటుంబాలకు సంఘం తరపున ఆర్థిక సాయం అందజేశామన్నారు. మాజీ అధ్యక్షులు భరణికాన రామారావు మాట్లాడుతూ సంఘటితంగా ఉంటే సాధించుకోలేనిది ఏమీ లేదని, ఇకనుండి సంఘ సంక్షేమ అభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఈ సమావేశంలో మమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న యాదవ సంక్షేమ సంఘం సభ్యులకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పదవీకాలంలో నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘశీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఒమ్మి నరసింగరావు, పిల్లా వెంకటేశ్వరరావు, మురుకుర్తి చిట్టియ్య, బొట్టా నాగరాజు, కొల్లి గంగాధర్ నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

# విశాఖ టీడీపీకి పట్టుకొమ్మ





### ఘనంగా టీడీపీ పార్లమెంట్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 25 :** విశాఖ నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ పార్లమెంట్ కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడిగా చోడే వెంకట పట్టాభిరామ్, ప్రధాన కార్యద ర్శిగా లోడగల కృష్ణతో పాటు ఇతర నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై న ఇంచార్జి మంత్రి డోలా బాల వీరాంజనే యులు మాట్లాడుతూ, "విశాఖ తెలుగుదేశం పార్టీకి పట్టుకొమ్మ. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలోనే అతిపెద్ద మెజారిటీలతో విశాఖ ఒక చారిత్రక రికార్డు సృష్టించింది" అని అన్నారు.

201419 టీడీపీ ప్రభుత్వ కాలంలో విశాఖను అభివృద్ధి పథంలో నడిపామని, 201924 వైసీపీ పాలనలో నగరాన్ని నాశనం చేశారని విమర్శించారు. పోలవరం నీటిని అనకాపల్లి వరకు తీసుకొచ్చిన ఘనత టీడీపీదేనని తెలి పారు. వైసీపీ నాయకులు భూకబ్జాలు, అవినీ తితో ప్రజలను ఐదేళ్లు ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. చివరకు ప్రజలు ఆ పాలనను భరించలేక ఇంటికి పంపించారని అన్నారు.

వైసీపీ హయాంలో చంద్రబాబు నాయుడిని విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో ఇబ్బందులకు గురిచే యడం, పవన్ కళ్యాణ్‌ను హోటల్‌లో అడ్డు కోవడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచాయని పేర్కొన్నారు. లోకేష్ రాజ్యాంగ గ్రంథాన్ని చేతిలో పట్టుకుని పాద యాత్ర చేసి రాజ్యాంగ విలువలను కాపాడారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, "విశాఖ టీడీపీ అంటే ఒక గొప్ప స్ఫూర్తి. పార్టీ కార్యకర్తల త్యాగాల వల్లే ఈ స్థాయిలో ఉన్నాం. కార్యకర్త లను ఎప్పటికీ మరవకూడదు" అని అన్నారు.

శాసనమండలి ప్రభుత్వ విప్ పీవీజీఆర్ నాయుడు గణబాబు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో అప్పులేని మంగళవారం, అరెస్ట్ లేని శుక్రవారం, కబ్జా లేని స్థలం, బాధలేని మనిషి లేదని విమర్శించారు. వైసీపీ నేత పాదయాత్ర చేస్తే గుంతలు లేని రోడ్లు కూడా కనిపిస్తాయని ఎద్దేవా చేశారు. టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ, విశాఖ ప్రజలు టీడీపీకి అద్భుతమైన మెజారిటీలు ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నాయుడు, లోకేష్‌కు విశాఖపై ప్రత్యేక ప్రేమ ఉందని అన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ మాట్లాడుతూ, కార్య కర్తల సంక్షేమానికి కట్టుబడి పనిచేసే పార్టీ టీడీపీ అని, సామాన్యులు, వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయ ణమూర్తి, శాసనమండలి సభ్యులు డా. వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పీ.వి. విష్ణుకుమార్ రాజు, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎన్టీఆర్ వైద్య సేవల చైర్మన్ సీతం రాజు సుధాకర్, వివిధ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించండి...!

### గిరిజనులకు, మోటార్ యూనియన్ కు పోలీస్ శాఖ సూచన



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 25 :** తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని గిరిజనులకు,మోటార్ యూనియన్ నేతలకు, కొయ్యూరు సీఐ శ్రీనివాస్ ఎస్ ఐ కిషోర్ వర్మ సూచించారు. ఆదివారం వారపు సంతలో చుట్టుపక్కల నుంచి వచ్చే గిరిజనులకు అలాగే మోటార్ యూనియన్ నేతలకు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని ఈ సందర్భంగా వారికి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వద్దని ఈ సందర్భంగా తెలియపరచారు.

# మా గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించండి.




**గుమ్మలక్ష్మీపురం జనవరి 25.పెన్ పవర్.** మా గ్రామానికి తారురోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే కు వినతిపత్రం అందించిన గ్రామస్తులు.కురుపాం మండలం పెదగొత్తిలి పంచాయతీకి చెందిన నాగరకుంటుంబాయి గ్రామస్తులు ఆదివారం నాడు గుమ్మలక్ష్మీపురంలో ఉన్న కురుపాం ఎమ్మెల్యే & ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి క్యాంపు కార్యాలయంలో తమ గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల తాము ఆర్థికంగా,సామాజికంగా వెనుకబడి ఉన్నామని నిత్యవసర వస్తువులు తెచ్చుకునేందుకు ఇబ్బందిగా ఉంటుందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన సందర్భాలలో అంబులెన్సులు గ్రామానికి చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో నాగర గ్రామం నుండి నాగరకుంటుంబాయి గ్రామం వరకు సుమారు 2 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎమ్మెల్యే ను కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే సమస్యను పరిశీలించి, రహదారి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

# యూనివర్సిటీ సాఫ్ట్ బాల్ జట్టులో మర్రిపాలెం విద్యార్థిని




**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి25:** మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని వెచ్చంగి ప్రియాంక ఆంధ్రా యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల యాజమాన్యం అన్నారు.

ఆంధ్రా యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో, విశాఖపట్నంలోని గొన్న కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ లో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్ ట్రయల్స్‌లో, మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఫిజికల్ డైరెక్టర్ ఎల్. రమణమ్మ మార్గదర్శకత్వంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుధా, వైస్ ప్రిన్సిపాల్ వికేటి మహాలక్ష్మి మాట్లాడుతూ... ఈ ట్రయల్స్‌లో బీఎస్సీ ఫిజిక్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న కుమారి వెచ్చంగి ప్రియాంక తన ప్రతిభను చాటుతూ ఆంధ్రా యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు.

ఈ విజయం ఆమె నిరంతర కృషికి, క్రమశిక్షణకు, అంకితభావానికి నిదర్శనం. ఈ ఘనత కళాశాలకే గర్వకారణంగా నిలిచింది అని వారు అన్నారు.

అలాగేఅధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అందరూ ప్రియాంక ని హృదయపూర్వకంగా అభినందించారు.

ప్రియాంక భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని కళాశాల యాజమాన్యం సిబ్బంది హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నారు.

# ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి...!



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 25 :** మండలంలోని మర్రిపాలెంప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ కే సుధా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని, ఓటు హక్కు ప్రాముఖ్యతగురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు అదేవిధంగా రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు శెట్టి వెంకటరమణ మాట్లాడుతూ...విద్యార్థులు అందరూ తమ ప్రాంతంలోని ప్రజలకు ఓటు హక్కు గురించి వివరించాలని తెలియపరిచారు. అనంతరం ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకేతర బృందం, విద్యార్థులు అందరూ కలిసి ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.

# వైసిపి తీరును తూర్పార పట్టిన టిడిపి శ్రేణులు



గాజువాక : పెన్ పవర్ , జనవరి 25 శవ రాజకీయాలుకు బ్రాండ్ అంబాసిడర్ వైకాపా పార్టీ, గోవిందరాజు అకాల మరణాన్ని రాజకీయం చేస్తూ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు చర్యలను చూసి సభ్య సమాజంలో ప్రతి ఒక్కరు కూడా అసహ్యించుకుంటున్నారు అని గాజువాక నియోజవర్గం సమన్వయకర్త ప్రసాదులు శ్రీనివాస్ అన్నారు. గాజువాక టిడిపి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో అనుబంధ సంస్థల నాయకులతో సమావేశం నిర్వహించి శవ రాజకీయాలు శునకానందం పొందుతున్న వైకాపా సైకోల తీరును ఎండగట్టారు అధికారంలో ఉన్నా ఏనాడు 76 వార్డు లో ఉన్న డంపింగ్ యార్డ్ సమస్యను పట్టించుకోలేని లేదు అన్నారు. శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు సుమారు 10 కోట్లు విలువచేసే డంపింగ్ యార్డ్ పనిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా శాశ్వత పరిష్కారాన్ని చేయాలని ఉద్దేశంతో చైర్మన్ పట్టాభి తో సమీక్ష సమావేశం నిర్వహించారు అని అన్నారు ఈ దురదృష్టకరమైన సంఘటన ను రాజకీయం చేస్తూ విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి విభాగం అధ్యక్షుడు తమ్మిరే శివప్రసాద్ ప్రధాన కార్యదర్శి సత్యారావు , వాణిజ్య విభాగ అధ్యక్షులు కార్యదర్శులు, మురళి, శివారెడ్డి , మైనార్టీ సెల్ అధ్యక్షుడు రహిమాన్ ,క్లస్టర్ ఇన్చార్జి శ్రీనివాసరాజు ,64వ వార్డు ప్రధాన కార్యదర్శి కదిరి పోలరాజు ,65వ వార్డు ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వరరావు, 67 వార్డు ప్రధాన కార్యదర్శి కొమ్మనాపల్లి సింహాచలం, గాజువాక టిడిపి నాయకులు ,పల్లా శివాజీ ,నక్క గంగరాజు ,తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు .

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సిరి సహస్ర నిలయంలో భక్తి వైభవంగా రథసప్తమి వేడుకలు

* జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా





**భీమిలి, పెన్ పవర్, జనవరి 25 :**విజయనగరం నగరంలోని సిరి సహస్ర నిలయం లో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో సాగాయి. ఈ వేడుకల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాస రావు చిన్న శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. సూర్యభగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శాస్త్రోక్త పూజల్లో మజ్జి శ్రీనివాసరావు, ఆయన సతీ మణి మజ్జి పుష్పాంజలి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. వీరితో పాటు వారి అల్లుడు, నెల్లిమర్ల నియోజకవర్గ వైఎస్ఆర్సిపి యువజన విభాగం అధ్యక్షులు ప్రదీప్ నాయుడు, కుమార్తె, 'చిన్న శ్రీను సోల్జర్స్' అధ్యక్షురాలు సిరమ్మ కూ డా ఈ పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల కోలాహలంతో సిరి సహస్ర నిలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రథసప్తమి పర్వదినాన సూర్యభగవానుడి అనుగ్రహం జిల్లా ప్రజలందరిపై ఉండాలని, వారు ఆయురారోగ్యా లతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిం చారు.

ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు పలువురు పార్టీ నాయకులు, అనుచరులు, భక్తులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## టీడీపీ పార్లమెంటరీ కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి భారీ ర్యాలీ



11వ వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు,అచ్యుత్ రావు, కాకి గంగరాజు ఆధ్వర్యంలో



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జనవరి 25:**విశాఖ పార్లమెంటరీ నూతన కార్యవర్గం కమిటీ ప్రమాణ స్వీకారం నకు అధిక సంఖ్యలో భారీ ర్యాలీగా జిల్లా పార్టీ ఆఫీస్ నాకు వెళ్లి అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్ కార్యదర్శి నోడగల కృష్ణ సహచర కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసారు.ర్యాలీ 11వ వార్డు గాంధీనగర్ బాలాజీ నగర్ తోటగరువు మీదుగా ర్యాలీ సభా ప్రాంగానికి చేరుకుంది.ర్యాలీలో నాయకులు పేపర్ నాయుడు,సిహెచ్. ఆదినారాయణ రాజు, కడుపుట్ల చిన్నారావు,బోయ శ్రీను, రంగాల మంగరాజు, కొల్లి ఎర్రాజీరావు, కిషోర్, బోద లక్ష్మణరావు, లింగబోతు అప్పారావు, ప్రేమ్ కుమార్, పిట్ట అప్పారావు, కనకలబంగారు నాయుడు, పిట్టా దేవుడు, బాబావల్లి, ఫిరోజ్, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, మహిళా నాయకురాలు రావాడ జయ, సీత తదితరులు పాల్గొన్నారు,

## ఓటు హక్కు శక్తివంతమైన ఆయుధం





* ముంచంగిపుట్టు మండల కేంద్రంలో, ఏనుగు రాయి పంచాయతీ కేంద్రంలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణ.
* డిప్యూటీ తహసిల్దార్ దన్ను.
* ఏనుగురాయి పంచాయతీ సర్పంచ్ ఎస్ నరసింగరావు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 25.** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు శక్తివంతమైన ఆయుధమని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మండల డిప్యూటీ తహసిల్దార్ దన్ను, ఏనుగురాయి పంచాయతీ సర్పంచ్ ఎస్ నరసింగరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో గల రెవిన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ దన్ను ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భారత ప్రజాస్వామ్యానికి కేంద్ర విందువు పౌరుడని, 18 ఏళ్ళు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు ఓటు విలువ, ఎన్నికల ఒక ప్రాముఖ్యతను గూర్చి అవగాహన కల్పించారు. అదేవిధంగా మండలంలో గల ఏనుగురాయి పంచాయతీలో సర్పంచ్ నరసింగరావు ఆధ్వర్యంలో జరిగిన ఓటర్ల దినోత్సవంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం సర్పంచ్ నరసింగరావు, ఎంపిటిసి మజ్జి సుబ్బలక్ష్మి మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం 2011 నుంచి ప్రతిఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తుందనీ, జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరు బాధ్యత యుతంగా ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడానికి ఓటు హక్కు వీలు పడుతుందని, ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అదీ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలదని పలువురు అన్నారు. ముంచంగిపుట్టులో జరిగిన కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ కే భాస్కర్, విఆర్ఓ రమేష్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీనుతో పాటు ఏనుగురాయి పంచాయితిలో జరిగిన కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ఆర్ శ్రావణ్ కుమార్, జనసేన మండల కార్యదర్శి జి సతీష్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు ఎం చిన్ని బాబు, నాయకులు తిరుపతిరావు, రామారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నలుగురి ప్రాణాలు కాపాడిన ఆంబోతుకు వైద్యం చేయించిన ఆజాద్ ఫౌండేషన్...



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 25:**ఎర్రవంతెన దిగువన ఓ కారు అతివేగంగా వచ్చి రోడ్డు పక్కన ఉన్న ఆంబోతును ఢీకొట్టి, అనంతరం గోడను ఢీకొంది. ఆ సమయంలో అక్కడ ఆంబోతు లేకపోయి ఉంటే, అక్కడున్న నలుగురు వ్యక్తులు తీవ్ర ప్రమాదానికి గురయ్యే అవకాశముందని స్థానికులు తెలిపారు. అదే ఘటనలో ఆ కారు పక్కగా వెళ్తున్న ఒక మోటార్ సైకిల్‌ను కూడా ఢీకొనడంతో, ఆ వ్యక్తి గాయపడగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. ప్రమాదంలో ఆంబోతు కాలికి తీవ్ర గాయం కావడంతో నడవలేని స్థితిలో పడింది. విషయం తెలుసుకున్న స్థానిక వ్యాపారస్తులు ఆంబోతుకు ఆహారం, నీరు అందిస్తూ, ఈ విషయాన్ని ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆజాద్ నాగ సుధ కొండ తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఆయన స్పందించి వెటర్నరీ సిబ్బందిని సంప్రదించి, ఆంబోతుకు తక్షణమే వైద్యం చేయించారు. ఈ వైద్య కార్యక్రమంలో ఆజాద్ నాగ సుధ కొండ, చిక్కం సుధాకర్, మట్టపర్తి లోక్ నాధ్, మధు ప్రకాశ్ ,పప్పోపుల తనేష్, వెటర్నరీ సిబ్బంది రాయుడు శివతేజ, రాపాక జస్వంత్ పాల్గొని చికిత్స అందించారు.

## హార్టికల్చర్ కోఆపరేటివ్ సొసైటి కమిటీ ఎన్నికలు నిర్వహించాలి



**గాజువాక :పెన్ పవర్, జనవరి 25**
వడ్లపూడి డిస్ప్లేసిడ్ పర్సన్స్ హార్టికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ జనరల్ బాడీ వడ్లపూడి కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ లో జరిగింది. కమిటీ కలపరిమితి పూర్తి అయినందున తక్షణము ఎన్నికలు జరిపించాలని తీర్మానము చేశారు. మీటింగ్ కి కార్యవర్గము, మెంబెర్స్ మరియు గ్రామ పెద్దలు మీ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న వారు వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం ,ఆర్‌ఎచ్ కాలనీలా పెద్దలు ఎస్ విజయ రామరాజు, ప్రగడ వేణుబాబు ,బొడ్డ గోవిందా ,ఎన్నేటి రమణ ,చిత్రాడ వెంకటరమణ , లక్కరాజు సోంబాబు, ముద్దపు దామోదర్ ,కన్నామ రెడ్డి వాసు ,దుగ్గపు దానప్పలు, బొండ్ గోవిందరాజులు, సొసైటీ ప్రెసిడెంట్ సెక్రటరీ ట్రెజరర్ డైరెక్టర్స్ వర్కర్స్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన బోర్ ను ప్రారంభించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి :బోండా





**గాజువాక పెన్ పవర్, జనవరి 25 :**జీవీఎంసీ 87వ వార్డ్ పరిధిలో తారకరామానగర్ మరియు పాత వడ్లపూడి గ్రామంలో నూతనంగా వేసిన బోర్ లను ప్రారంభించారు. ఈ కార్యక్రమనకి ముఖ్య అతిధిగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం పాల్గొన్నారు. పాత వడ్లపూడి మరియు తారకరామానగర్ లో ఉన్న ప్రజలు మంచినిటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని వారిని దృష్టిలో పెట్టుకొని ఆ ప్రాంతాల్లో జీవీఎంసీ నిధులతో రెండు బోర్లు వేయడం ద్వారా నీటి సమస్య పరిస్కారం అవుతుందని కుటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని వార్డు కార్పొరేటర్ బోండా అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు సాగి విజయరామరాజు, బెల్లంకొండ రాజన్ రాజు, డీవీ అప్పారావు, వర్రే రాంబాబు, కళ్లేపల్లి శ్రీనివాసవర్మ, బొడ్డేటి సత్తిబాబు,మల్లా రాము, కనకసత్యం, భాగ్యలక్ష్మి, బొడ్డేటి డెమ్ములు, వై. నాగేశ్వరరావు,సుందర్ సునీల్, తారకరామా నగర్, పాత వడ్లపూడి గ్రామ ప్రజలు ప్రజలు, వాటర్ లైన్ డిపార్ట్మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

# రథసప్తమి - సూర్యారాదనకు విశిష్ట పర్వదినం





ఊహించని భక్తులు రాక -జాతరను తలపించిన జనం

ఆదివారం రథసప్తమి సూర్యనారాయణకి ఇష్టమైన రోజు

భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న భక్తులు

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జనవరి 25:** మాగశుద్ధ సప్తమి నాడు జరుపుకునే రథసప్తమి అత్యంత పుణ్యప్రదమైన పర్వదినం ఈ రోజున సూర్యుడు ఏడు గుర్రాల రథంపై ఉత్తరాయన ఘమనాన్ని ప్రారంభిస్తాడని పురాణ విశ్వాసం.భక్తులు వేకువజామున లేచి సూర్యార్ధన ద్వారా ఆరోగ్యం శ్రేయస్సు లభిస్తాయని భక్తుల నమ్మకం ప్రకృతి జీవన శక్తిని కృతజ్ఞతగా ఈ పర్వదినం విశేషంగా నిలుస్తుంది. సింహాచలం దేవస్థానం శ్రీ కృష్ణాపురం గోశాల వద్ద ఉన్న సూర్యనారాయణ స్వామి వారి దర్శనం కై భక్తులు బారులు తీరారు.సింహాచలం దేవస్థానం వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.దేవస్థానం ఈవో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లును స్వయంగా పరిశీలించారు భక్తులకు సౌకర్యాలు ఏర్పాట్లు కల్పించారు,భక్తులు రెండు మార్గాల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.ఆరిలోవ పోలీస్ స్టేషన్ సీఐ పోలీస్, ట్రాఫిక్ పోలీసులు అధికారులు ఏర్పాట్లు పరిశీలించి ట్రాఫిక్కును తోపులాటలు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.ఊహించని దాని కంటే భక్తులు రావడంతో ఎప్పటికప్పుడు దేవాలయ పోలీస్ సిబ్బంది అప్రమత్తమై జాగ్రత్తలు పాటించారు. ప్రముఖ సినీ హీరో శ్రీకాంత్ స్వామివారిని దర్శించుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా కొండల మధ్య నెలకొని ఉన్న సూర్యనారాయణ ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని భక్తులకు సేవలు అందిస్తున్న పోలీస్ సింహాచలం దేవస్థానం సిబ్బందికి అయినా ధన్యవాదాలు తెలియజేశారు, భక్తులకు రథసప్తమి శుభాకాంక్షలు తెలియజేశారు. అరసవల్లి సూర్యనారాయణ మూర్తి దర్శనానికి వెళ్లే సమయములో సింహాచలం దేవస్థానం సమీపంలో ఉన్న సూర్యనారాయణమూర్తి సన్నిధిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తూ మరింత అభివృద్ధి చెందుతుందని ఇప్పటికే అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం ఆశ్చర్యం కలిగించిందని ఆయన అన్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో వెలగపూడి ప్రతాపరుద్ర,13 వ వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ. కృష్ణాపురం, పైనాపిల్ కాలనీ ధారపాలెం టిడిపి నాయకు ప్రసాద్,వైసీపి సీనియర్ నాయకులు వెంకటరెడ్డి,స్థానిక నాయకులు వరం రాజు,సునీల్ రాజు, పలువురు స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా సేవలను అందించారు.కొందరు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. రథసప్తమి రోజున సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించాడు. భక్తులకు ప్రసాదాలు అందించడంలో స్థానిక ప్రజలు ఎప్పుడు ముందు ఉండేవారు,గిరి ప్రదక్షిణ సమయంలో సమీప ప్రజలు నాయకులు భక్తులకు ప్రసాదాలను అందించేవారు ఊహించిన దాని కన్నా భక్తులు రావడంతో తగు ఏర్పాటు చేసుకోలేకపోయామని రాబోయే సంవత్సరంలో భక్తులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించి భక్తులకు ప్రసాదాలు అందజేయగలమని స్థానిక నాయకులు తెలియజేశారు.





## భీమిలి నియోజకవర్గంలో స్వచ్ఛతకు నూతన ఊపిరి

స్వచ్ఛ రథాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 25 :**భీమిలి నియోజకవర్గంలో గ్రామాల పరిశుభ్రత లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ రథాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. భీమిలి, ఆనం దపురం, పద్మనాభం మండలాలకు కేటాయిం చిన స్వచ్ఛ రథం ఆటోలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు.
ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వచ్ఛ రథాలను పరిశీలించి, వాటిలో అందించే నిత్యావసరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లలో సేకరించిన చెత్తకు ప్రతిఫలంగా కొబ్బరినూనె, సబ్బులు, బిస్కెట్లు వంటి అవసర సామగ్రిని ప్రజలకు అందజేస్తారని తెలిపారు.గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, ప్రజలు చురుకు గా పాల్గొని ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవని గంటా పిలుపునిచ్చారు. నెలలో 25 రోజులు స్వ చ్ఛ రథాలు గ్రామాల్లో తిరుగుతాయని, మిగిలిన రోజుల్లో సంబంధిత ఎం.పి.డి.ఓ. కార్యాలయా ల్లో అందుబాటులో ఉంటాయని వివరించారు.
ఈ కార్యక్రమంలో భీమిలి ఎం.పి.డి.ఓ.లు నరసింహారావు, జానకి, రూపేష్, జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, సరగడ అప్పారావు, తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, లొడగల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రాచపోలమాంబ తిరువీధి మహోత్సవం

22వ పరస సందర్భంగా భక్తజన సందడి ఘనంగా అమ్మవారి పూజలు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 25 :**అల్లిపురం గ్రామదేవత శ్రీ రాచపోలమాంబ అమ్మవారి తిరువీధి మహోత్సవం ఆదివారం సాయంత్రం భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామప్రజలు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.
బౌడార రోడ్డు, గోకుల్ థియేటర్ సమీపంలోని శ్రీ రాచపోలమాంబ ఆలయం నుంచి ప్రారంభమైన తిరువీధి మహోత్సవం మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ సాగింది. స్థానిక మహి ళలు పిండి వంటలు, బిందెలతో నీటిని తీసుకు వెళ్లి మిరపకాయల వీధిలో కొలువుదీరిన పరదేశమ్మకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా శ్రీ ధనశక్తి దుర్గాదేవి ఆలయ ధర్మకర్త రవిభవాని అమ్మవారి ఘటాన్ని శిర స్సుపై ధరించి తిరువీధుల్లో ఊరేగింపుగా పాల్గొ న్నారు. జై శ్రీరామ్ కోలాట బృందం ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నా యి.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామప్రజలు, రైజింగ్ గైస్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవానికి ప్రత్యేక శోభ చేకూర్చారు.
సోమవారం అమ్మవారి 22వ పరస సందర్భంగా వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణతో పాటు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యవర్గ సభ్యులు తెలిపారు.

## ధారాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న అరకు ఎంపీ దంపతులు

ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని ఎంపీ హామీ





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 26:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం ధారాలమ్మ తల్లి ఘాట్ రోడ్‌లోని ప్రముఖ ప్రాచీన శ్రీ ధారాలమ్మ తల్లి అమ్మవారిని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజ రాణి కుటుంబ సభ్యులతో ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించగా, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపీ తనుజరాణి మరియు ఆమె భర్త శెట్టి వినయ్ దంపతులను సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. దేవస్థాన అభివృద్ధి కోసం ఎంపీ తనుజరాణి సహకరిస్తానని తెలిపారు. ధారాలమ్మ అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్న ఎంపీ తను ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఈ అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు సంబంధిత చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, దారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు, చింతపల్లి ఎంపీపీ అనూష దేవి, కొయ్యూరు ఎంపీపీ రమేష్, సీనియర్ వైసీపీ నాయకులు జల్లి సుధాకర్, బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచులు,ఎంపీటీసీలు, వైసిపి నాయకులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 25 :** భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం వారం వారం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి తెలిపారు. అలాగే భవిష్యత్తులో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ రమణ, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ చరిత్ర లో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమైనది.





ఆర్యవైశ్య మండల నూతన కార్యవర్గం ఎన్నిక.

**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 25:** భారతదేశ చరిత్రలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమైనది అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో మహాత్మా గాంధీ కీలకపాత్ర వహించారనేది అందరికీ తెలిసిన విషయమే అన్నారు.ఆంధ్ర రాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు ఇలా ఎంతోమంది తమ జీవితాలను త్యాగం చేసిన వారిలో ఆర్యవైశ్యులు ఉన్నారన్నారు.
ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్న రామ సత్యనారాయణ, కాకినాడ జిల్లా అధ్యక్షులు పులవర్తి కుమార్, ఉభయ గోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు గొల్లపూడి త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఎంపికైన వాగు రాజేష్ సేవలను ప్రశంసించారు. అలాగే స్థానికంగా అసంపూర్ణంగా ఉన్న ఆర్యవైశ్య కళ్యాణ మండపాన్ని పునర్ నిర్మించేందుకు ప్రభుత్వ పరంగా సహాయం అందించాలని ఎమ్మెల్యేని కోరారు. కాగా ఆమె దీనిపై స్పందిస్తూ శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా రాతికింద సతీష్, కోశాధికారిగా పులవర్తి శ్రీనివాస్ లు ఎంపికయ్యారు వీరిని రాష్ట్ర అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు అలమండ చలమయ్య,బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, మండల ఉపాధ్యక్షులు చిక్కాల రాజ్యలక్ష్మి, ఆర్యవైశ్య పెద్దలు ఊర కృష్ణ, వాగు గున్నం రాజు,దేవకి రాంబాబు,పూర నానాజీ, అనంతపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి -ఎమ్మెల్సీ కుడుపూడి



**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి ,25,:** మాచవరం కామయ్యకోడు మంచినీటి చెరువు స్థానిక ప్రజలకు పాలిటిగా శాపంగా మారిందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు అన్నారు. ఇప్పటికే గతంలో ఇద్దరు మరణించారని. రూరల్ వాటర్ డెవలప్మెంట్ సప్లై అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నయని ఆయన అన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ త్వరలో తాను నేషనల్ హ్యూమన్ రైట్స్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని అన్నారు. బాధిత కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. బాదిత కుటుంబాన్ని పరామర్శించిన మనోధైర్యం కల్పించారు.

## ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధం




**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 25 :** ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధమని, ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి. చంద్రమౌళీశ్వరి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఆర్డీవో కత్రెడ్డి శ్రీరమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జడ్జి చంద్రమౌళీశ్వరి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసేందుకు, ఆయా ఎన్నికల్లో అత్యధిక ఓటర్లు ఓటును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు జాతీయ ఎన్నికల సంఘం 2011 నుంచి ప్రతీ ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. పద్దెనిమిది సంవత్సరాలు వయస్సు పూర్తి అయిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని చేసుకొని, ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటు హక్కుకు ఉన్న విలువను ఓటర్లు తెలుసుకొని వారి అమూల్యమైన హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు జడ్జి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అలాగే సీనియర్ సిటిజన్ ఓటర్లను సన్మానించి, కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న యువ ఓటర్లకు ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో కె.వి. మాధవరావు, తహసీల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి, డీటీ ఎం.వి.వి. భానుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com